Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

ఆదివారం, మే 31, 2026 | సంపుటి - 20 | సంచిక 252 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులకు ఊరట

### నిబంధనలపై అమెరికా యూటర్న్



వాషింగ్టన్ : శాశ్వత నివాస హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా తమ స్వదేశాలకు తిరిగి వెళ్లాలని ఇటీవల ప్రకటించిన అమెరికా ప్రభుత్వం తాజాగా వెనక్కి తగ్గింది. ఆ నిబంధన అందరికీ వర్తించదని, దరఖాస్తును బట్టి ఇమిగ్రేషన్ అధికారులు నిర్ణయం తీసుకుంటారని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తాజాగా ప్రకటించింది. తాత్కాలిక వీసాలపై ఉన్నవారు గ్రీన్ కార్డ్ పొందాలంటే తమ స్వదేశంలోనే దరఖాస్తు చేసుకోవాలని గత వారం అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ మార్గదర్శకాలు విడుదల చేసింది.

తరువాయి 2లో

# రైతులకు వాతావరణ సూచనలు

### తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం

### ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



హైదరాబాద్ : రాష్ట్రంలోని రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమంను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా (డీఐఎల్ ఇండియా), ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ సందర్భంగా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ శ్రీ అంకుర్ గర్ 2లో



### పేదవాని గుమ్మం వద్దకు

# ప్రజాప్రభుత్వ పధకాలు

- పట్టణ పేదలకు పెద్దన్న రేవంత్ రెడ్డి కానుక
- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్ : పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరువాయి 2లో



2

## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

- సిబిఎస్ఇ మూల్యంకలనంలో లోపాలు దారుణం
- అసమర్థ వ్యవస్థలపై దేశాన్ని నిర్మించలేమన్న కెటిఆర్
- విద్యార్థులకు అండగా పోరాడుతామని ప్రకటన

హైదరాబాద్ : దేశంలో నీట్ పరీక్షల అక్రమాలపై రేగిన వివాదం ఇంకా చల్లబడకముందే, భారతీయ విద్యా వ్యవస్థ ప్రతిష్టను మరింత మసకబారుస్తూ సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవలే విడుదలైన సీబీఎస్ఈ ఫలితాలలో డిజిటల్ మూల్యాంకనం లోపాల కారణంగా



2

## కర్నాటక సిఎల్‌పి నేతగా డికె ఏకగ్రీవ ఎన్నిక

- 3న ప్రమాణ స్వీకారానికి పార్టీ నిర్ణయం
- డికెను సిఎల్‌పి నేతగా ప్రతిపాదించిన సిద్దరామయ్య
- నాయకత్వ మార్పు సజావుగా జరిగిందన్న కెసి వేణుగోపాల్

### మోటర్లకు మీటర్లు పెడితే

# ఎన్నికల్లో పోటీచేయను

### ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పుకుంటా

### లేకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా

### రైతుల ముసుగులో లబ్ధికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు

- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ది కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం 2లో



### మోసపు హామీలతో

# గద్దెనెక్కి దగా

- కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు
- బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు
- కేంద్రాన్ని విమర్శించడం తప్ప చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి

హైదరాబాద్ : మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని.. 2లో



### జిందాల్ తరహాలో

# వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు

- సాంకేతికతతో సాధ్యాసాధ్యాలను పరిశీలించండి
- గోదావరి కాలుష్యాన్ని తొలగించేందుకు యత్నం
- పల్నాడులో పర్యటించి జిందాల్ ప్లాంట్‌ను పరిశీలించిన పవన్

పల్నాడు : జిందాల్ పరిశ్రమ తరహాలోనే గోదావరి నదీ కాలుష్యాన్ని అరికట్టేందుకు సాంకేతికతను ఎలా అనుసంధానం చేయవచ్చో పరిశీలించాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో చెత్తను వేరు చేసి, దాన్ని విద్యుత్ తయారీకి ఉపయోగించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో రోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా మరిన్ని 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పల్నాడు జిల్లా కొండవీడు పరిధిలోని జిందాల్ 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో చెత్తను సేకరించడం దగ్గర నుంచి 2లో



2

## విశాఖ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి

- అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద ప్రతిపాదనలు
- వైసిపి హయాంలో మందగించిన అభివృద్ధి
- విశాఖ ఎంపీ శ్రీభరత్ వెల్లడి

### టిడిపి మహిళా

# రిజర్వేషన్లపై చర్చ

### అన్ని పార్టీలు అనుసరించక తప్పనిస్థితి

### ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



అమరావతి : డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ని టీడీపీ ప్రకటించడం దేశ రాజకీయాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిందన్నారు. మహిళా రిజర్వేషన్లను అన్ని పార్టీలు స్వాగతించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. మొదటి నుంచీ మహిళలకు టీడీపీ అండగా ఉందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. డీలిమిటేషన్ విషయంలో 2011 జనాభా లెక్కలైనా, తాజా లెక్కలైనా మనకు నష్టం కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందుకే ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. పెంచిన స్థానాలను మహిళలకు కేటాయించవచ్చుని అభిప్రాయపడ్డారు.

తరువాయి 2లో

# గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులకు ఊరట

ఈ ప్రకటనతో హెచ్1బీ వీసాదారులు, విదేశీ విద్యార్థులు, తాత్కాలిక ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనిపై తాజాగా డీహెచ్ఎస్ వివరణ ఇచ్చింది. ఈ నిబంధన ఎప్పట్నుంచో ఉందని, ఇమిగ్రేషన్ అధికారులకు తమ విచక్షణాధికారాన్ని గుర్తు చేయడానికే గత వారం తాము మార్గదర్శకాలు విడుదల చేశామని తెలిపింది. రఖాస్తుదారుడి పరిస్థితులు, ఆర్థిక ప్రయోజనాలు, జాతీయ ప్రయోజనాల వంటి అంశాలను పరిశీలించి అతడు అమెరికాలో ఉండాలా, స్వదేశానికి వెళ్లాలా అనే విషయంపై ఇమిగ్రేషన్ అధికారులు నిర్ణయం తీసుకుంటారని డీహెచ్ఎస్ తెలిపింది (ఉస॥ని అజీసట ఖసనీఇ౹బబ). ప్రత్యేకించి అమెరికా ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే లేదా జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన ఉద్యోగాల్లో ఉన్నవారికి మినహాయింపులు లభించే అవకాశం ఉందని యూఎస్‌సీఐఎస్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.

# రైతులకు వాతావరణ సూచనలు

న్యూఢిల్లీ నుండి జూమ్ ద్వారా పాల్గొని, తమ సంస్థ రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి గారికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రత్యేకంగా మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం అత్యంత అవసరమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

# పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ మార్కుల తారుమారు వ్యవహారం దేశవ్యాప్తంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. న్యాయం కోసం ఉధృతంగా పోరాడుతున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతును ప్రకటిస్తూ.. దేశ భవిష్యత్తును ఇలాంటి కుళ్ళిన, అసమర్థ వ్యవస్థల మీద ఎంతమాత్రం నిర్మించలేమని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంలో గతంలో తెలంగాణను కుదిపేసిన ఒక చేదు జ్ఞాపకం మళ్లీ తెరపైకి వచ్చిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలను అస్తవ్యస్తం చేసి, పలువురు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన 'గ్లోబరేనా' సంస్థే ఇప్పుడు కేవలం తన పేరును మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి అంతకంటే పెద్ద కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. కేంద్ర బోర్డు నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇంత పెద్ద గందరగోళం నెలకొందని విమర్శించారు. నాడు గ్లోబరేనా వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిం చిందని కేటీఆర్ గుర్తుచేశారు. లోపాలను వెలికితీసేందుకు తక్షణమే ముగ్గురు నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తప్పు చేసిన సంబంధిత అధికారులను పదవుల నుంచి తక్షణమే తొలగించామని కేటీఆర్ వివరించారు. అంతేకాకుండా, బాధ్యురాలైన సదరు సంస్థపై కోర్టులో చట్టపరమైన క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నామని ప్రస్తావించారు. ఇంతటి చెడ్డ పేరు ఉన్న ఒక అసమర్థ సంస్థను సీబీఎస్ఈ బోర్డు ఎలా నమ్మిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ఆ సంస్థకు లబ్ది చేకూర్చేందుకే బోర్డు తన నిబంధనలను పదే పదే మార్చిందని ఆయన ఆరోపించారు. ఒక చిన్న పేరు మార్పు పక్రియతో పాత తప్పులను దాచిపెట్టి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తుతో ఆడుకోవడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, తప్పుడు మూల్యాంకనాలతో దేశంలోని విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారని, లక్షలాది మంది మానసిక క్షోభకు కారణమైన ఈ మార్కుల వివాదానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి కచ్చితంగా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. బాధితులైన విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# టిడిపి మహిళా రిజర్వేషన్లపై చర్చ

దీంతో గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారి ఆలోచన కూడా మారవచ్చని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందన్నారు. రెండు బిల్లులను తీసుకురావడానికి కేంద్రం సిద్ధమవుతోందని, ఆ రెండింటినీ విడదీసి చూడాల్సిన అవసరం ఏముందని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. రెండు బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లులు తప్పనిసరిగా తీసుకురావాలని, ఇవి దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

## బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం

### అందుదే అరెస్ట్ చేసిన పోలీసులు

### మీడియాతో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

హైదరాబాద్ : బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి కారణం ఆయన మాటలేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీభవన్ లో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ... బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన మాటలే కారణం. సుమన్ వ్యాఖ్యల వెనక కేసీఆర్ కుట్ర ఉంది. మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి. సామాన్య ప్రజలు తిరిగే రైళ్లపై మీకు ఎందుకు అంత అక్కసు. రైళ్లలో తిరిగేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలే. మీకు ఓట్లేయలేదని పెదలపై కోపమా?. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేనూ నిరసన కార్యక్రమాలు చేశాను. మేం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేశాము' అని వెంకట్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. ఆయన మాటలకు కౌంటర్ గా ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ స్పందించారు. కేసీఆర్ ఒకయానికి డ్రగ్ శాఖ ఇచ్చాడు. మరొకరికి పిచ్చోడిలా వాగే శాఖ ఇచ్చాడు. సుమన్‌కి రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చాడు. బీఆర్ఎస్ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. సుమన్ లాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ పెట్టాలి' అంటూ బల్మూరి వెంకట్గ్ ÷ర్ అయ్యారు.

# పేదవాని గుమ్మం వద్దకు ప్రజాప్రభుత్వ పథకాలు

సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ – గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ది కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

# కర్నాటక సిఎల్‌పి నేతగా డికె ఏకగ్రీవ ఎన్నిక

బెంగళూరు : కర్ణాటక కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నేతగా ఎన్నికైన డీకే శివకుమార్ జూన్ 3న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఆయన ప్రమాణ తేదీ అధికారికంగా ఖరారైంది. జూన్ 3న కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేస్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం సాయంత్రం ప్రకటించారు. సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నికైన అనంతరం మీడియాతో ఆ వివరాలను కేసీ వేణుగోపాల్ పంచుకున్నారు. సీఎల్పీ నేతగా డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు చెప్పారు. డీకే పేరును కాంగ్రెస్ అధిష్టానం సూచించగా, తొలుత సిద్ధరామయ్య, ఆ తర్వాత పరమేశ్వర ఆయన పేరును సీఎల్పీ సమావేశంలో ప్రతిపాదించారని, ఏకగ్రీవంగా దీనికి ఎమ్మెల్యేలు ఆమోదం తెలిపారని వివరించారు. ముఖ్యమంత్రి మార్పు కాంగ్రెస్ పార్టీకి సమస్య అవుతుందని అంతా భావించారనీ, అయితే తమదంతా ఒక కుటుంబమని, అంతా ఏకగ్రీవంగా ఈ ఎన్నికను ఆమోదించడం పార్టీకి గర్వకారణమని అన్నారు. 2028లోనూ నాయకులందరికీ సపోర్ట్‌తో కర్ణాటకలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలతో సిద్ధరామయ్య ఈనెల 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యకు గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇదిలావుంటే అంతకుముందు కర్ణాటకలో నాయకత్వ మార్పు పక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా డీకే శివకుమార్ ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్ పేరును మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించగా సీనియర్ నేత పరమేశ్వర బలపరిచినట్లు తెలిసింది. మరోవైపు జూన్ 3న నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. ఇందుకోసం బెంగళూరులోని లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలిపింది. తాజాగా సీఎల్పీ నేతగా ఎన్నికైన డీకేఎస్.. గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు తనను ఆహ్వానించాలని కోరనున్నారు. పరిశీలకులుగా కెసి వేణుగోపాల్,జైరాం రమేశ్ హాజరయ్యారు.

# విశాఖ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి

విశాఖపట్నం : విశాఖ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం మరోసారి అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద ప్రతిపాదనలు సమర్పిస్తున్నామని విశాఖ ఎంపీ శ్రీభరత్ చెప్పారు. అలాగే విశాఖ బీచ్‌లలో లభించే ఖనిజ సంపదను త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించేందుకు దిశ సమావేశం ఒక మంచి వేదికగా నిలుస్తోందని శ్రీభరత్ అన్నారు. దిశ సమావేశంలో 33 విభాగాలకు చెందిన అధికారులతో పలు అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న విశాఖపట్నాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద విశాఖకు రూ.1,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరైనట్లు వెల్లడించారు. మధురవాడ జోన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, నగర నీటి పంపిణీ వ్యవస్థ బలోపేతం వంటి కీలక ప్రాజెక్టులు చేపడుతున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టుల పురోగతిపై దిశ సమావేశంలో సమీక్షించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో అభివృద్ధి పనులు మందగించాయని, అనేక కీలక ప్రాజెక్టులు పక్కనపెట్టబడటంతో వాటి వ్యయం ప్రస్తుతం భారీగా పెరిగిందని శ్రీభరత్ విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన ప్రాజెక్టులను ఇప్పుడు కొత్త పథకాల ద్వారా తిరిగి ముందుకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, దిశ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి అంశాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించామని, విశాఖ అంతర్జాతీయ గుర్తింపు పొందే దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశాలు నిర్వహించడం వల్ల అభివృద్ధి కార్యక్రమాల అమలులో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని గణబాబు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

### జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం

### కేశవరావు కమిటీ తొలి భేటీ

హైదరాబాద్,మే30 : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది.

# మోసపు హామీలతో గద్దెనెక్కి దగా

తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి వెళ్ళే వరకు మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమీషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమీషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే ఫెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్ని బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని పదేపదే చెపుతున్నారు. ధాన్యం సేకరణపై కేంద్రం గతంలో 9 సార్లు పొడిగింపు ఇచ్చింది. ఎప్పుడూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేదు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలో బీర్ఎస్ అదే పని చేసింది. కేంద్రం ఇప్పటి వరకు ఇచ్చిన కోటను పూర్తి చేయలేదు. 52.24 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రంతో ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.

# జిందాల్ తరహాలో వేస్ట్‌టూ ఎనర్జీ ప్లాంట్లు

బాయిలర్‌లో అది బూడిదగా మారే వరకూ..పక్రియను ఆసక్తిగా పరిశీలించారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ విధానంపై ప్లాంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా అధికారులు, ఎ÷–లాంట్ నిర్వాహకులకు ఉప ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా పేరొందిన 'ఇండోర్ మోడల్' తరహాలో చెత్తను పద్ధతిగా, పారదర్శకంగా వేరు చేసేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు.. ప్లాంట్ అధికారులు ఉప ముఖ్యమంత్రికి అంతర్జాతీయ, జాతీయ స్థాయి గణాంకాలను వివరించారు. సింగపూర్‌లో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 2.8 శాతం కేవలం ఇలాంటి చెత్త ప్లాంట్ల నుంచే లభిస్తోందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ గ్రిడ్‌తో ఈ వ్యర్థ ఆధారిత విద్యుత్ ప్లాంట్ల అనుసంధానం చాలా అద్భుతంగా ఉందని అధికారులు ప్రశంసించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సరఫరా వృథా శాతం అత్యంత తక్కువగా ఉండటం విశేషమని డిప్యూటీ సీఎంకు ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు.

# కాళేశ్వరంను పడావు పెట్టడం సరికాదు

### ప్రజాఎక్కు మరమ్మత్తులపై ఎందుకీ తాత్సారం

### ప్రభుత్వం తీరుపై బండరు దత్తాత్రేయ విమర్శలు

పెద్దపల్లి,మే30 : లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు, ప్రజలకు పనికి రాకుండా పోయిందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ విమర్శించారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే స్పష్టమైన నివేదిక ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దత్తాత్రేయ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం నీరు లేకపోవడం ఆందోళనకర విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన సాగునీటిని అందించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ నేతలవి దుర్మార్గపు ఆలోచనలు

### అందులో భాగంగానే బాల్క వ్యాఖ్యలు
### మండిపడ్డ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

హైదరాబాద్ : బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బలయ్యాడని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల కాలంలో బీఆర్ఎస్ నాయకులు వాడుతున్న భాష, చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ అగ్రనాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ శైలిపై, వారి అణచివేత ధోరణిపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. 'బాల్క సుమన్‌తో ఎవరు మాట్లాడించారో కూడా తెలియాలి. పట్టాలు కోయాలని, దాడులు చేయాలని పిలుపునివ్వడం పూర్తిగా బీఆర్ఎస్ సంస్కృతి. ఇది ముమ్మాటికీ కేసీఆర్ నైజం. ఆయనకు తెలిసిన రాజకీయ నీతి ఇదే. కేసీఆర్ తనకు తెలిసిన కుటిల రాజకీయాన్నే కొడుకు కేటీఆర్‌కు నేర్పించారు. కేటీఆర్ తనకు తెలిసిన ఆ నీతినే బాల్క సుమన్‌కు నూరిపోశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ తప్పులు చేసి, దాన్ని ప్రశ్నిస్తే జై తెలంగాణ అంటారు. ఫార్ములా రేస్ నిధుల దుర్వినియోగంపై విచారణకు వెళ్తూ కూడా కేటీఆర్ జై తెలంగాణ అంటారు. తప్పులు చేసి వాటిని గొప్పగా చెప్పుకోవడం బీఆర్ఎస్ నేతలకే చెల్లింది. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగ సంఘాలు, చివరకు రైతులను కూడా రెచ్చగొట్టడమే ఏకైక ఎజెండాగా పెట్టుకున్న బీఆర్ఎస్ నాయకులు.. అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారు. సుమన్‌తో మాట్లాడించింది ఎవరో పోలీస్ అధికారులు విచారణ చేయాలని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు ఆలోచనల నుండి బిఆర్ఎస్ నేతలు బయటకు రావాలన్నారు.

# కాంట్రాక్టర్ల ధర్నాకు బిఆర్ఎస్ మద్దతు

### వారి సమస్యలు వెంటనే
### పరిష్కరించాలన్న కెటిఆర్

హైదరాబాద్,మే30 : హైదరాబాద్ నగరంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ.. కాంట్రాక్టర్ల సమస్యలు, హామీల అమలు తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమవు తోందని విమర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..'కేసీఆర్ హయాంలో అధికారులకు స్వేచ్ఛనిచ్చి పని చేయమని చెప్పారు. ఒక్కో విద్యార్థి మీద ప్రత్యేక దృష్టి పెట్టి తొమ్మిదిన్నర ఏళ్ళు చదివించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చారు. రేవంత్.. పేమెంట్ కోటాలో సీఎం పదవి తెచ్చుకున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుడతారా అని సీఎం అంటున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుట్టరని తెలుసు.. 30నెలల్లో కూడా పిల్లలు పుట్టకుంటే ఏమంటారు? కాంట్రాక్టులన్నీ సీఎం బామ్మర్దికి, మంత్రి పొంగులేటి కొడుకుకు వస్తున్నాయి. ముఖం బాగాలేక అద్దం పగుల కొట్టినట్లు ఉంది పరిస్థితి . కేసీఆర్ అప్పుల పాలు చేశారు అంటున్నాడు. కేసీఆర్ అప్పు చేసి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశారు. ఢిల్లీకి పోదాం.. జీవో నెంబర్ 17 రద్దు అయ్యేవరకు పోరాడుదాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. సెక్యూరిటీ లేకుండా రోడ్డు మీదకు రండి.. మీకు పరిస్థితి తెలుస్తుంది. మళ్ళీ 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది' అని కేటీఆర్ అన్నారు.

# విజయవాడ హైవేపై బస్సు దగ్ధం

### తృటిలో తప్పిన పెద్ద ప్రమాదం
### బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితం

నల్లగొండ,మే30 : హైదరాబాద్-విజయవాడ హైవేపై మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న రెయిన్‌బో ట్రావెల్స్‌కు చెందిన బస్సులో మంటలు చెలరేగగా.. ప్రమాద సమయంలో 36 మంది ప్రయాణికులు బస్సులో ఉండగా.. అందరూ సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణ మధ్యలో బస్సు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పరిస్థితిని వెంటనే గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును రోడ్డుపక్కన నిలిపివేసి ప్రయాణికులను వెంటనే దిగిపోవాలని హెచ్చరించాడు. దీంతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటకు వచ్చారు. అయితే కొద్దిసేపటికే మంటలు బస్సు అంతటా వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. బస్సులో మంటలు చెలరేగడానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

# హైడ్రా మరో భారీ అపరేషన్

### పుప్పాలగూడ పరిధిలో ముష్కిన్ చెరువుకు విముక్తి

హైదరాబాద్,మే30 : హైడ్రా మరో భారీ అపరేషన్ చేపట్టింది. కబ్జాకు గురైన చెరువును పరిరక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-నార్సింగి గ్రామాల పరిధిలో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ముష్కిన్ చెరువు అభివృద్ధి పేరుతో చేస్తున్న కబ్జాలకు చెక్ పెట్టింది. చెరువులో.. రూ.5,500 కోట్ల విలువైన కబ్జాలను తొలగించి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తోంది. హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం చెరువు 52.20 ఎకరాల పరిధిలో ఉండగా.. చెరువు మధ్యలోంచి కట్ట నిర్మించి 34.21 ఎకరాలు కబ్జా చేసే ప్రయత్నం జరిగిందని హైడ్రా పేర్కొంది. సీఎస్ఆర్ నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ.. అభివృద్ధి మాటున కబ్జాకు ప్రయత్నించింది.

# మూడవ డిస్కమ్‌తో రైతులకు ఉరే

### రైతు డిస్కమ్‌ను బిఆర్ఎస్ వ్యతిరేస్తోంది
### దీనికి వ్యతిరేకంగా పోరాడుతాం: బడుగుల



సూర్యాపేట,మే30 : తెలంగాణ రైతాంగం పాలిట ఉరితాడుగా మారనున్న మూడవ డిస్కం ఏర్పాటును బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఈ విషయంలో రైతుల పక్షాన పార్టీ ముందుండి పోరాడుతుందని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కేసీఆర్ చేసిన రైతు అనుకూల కార్యక్రమాలు రైతుబంధు, ఉచిత విద్యుత్, ధాన్యానికి ధర ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తుందన్నారు. మూడవ డిస్కం తీసుకొస్తామని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ముందు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టక తప్పదనడం రైతులను నిలువున మోసం చేసే ప్రయత్నమే అన్నారు. రైతులు కరెంట్ ఎంత వాడుతున్నారో తెలియడం లేదని కాబట్టి రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడం తప్పదు కాబట్టి మూడవ డిస్కం పెడతామనడం సిగ్గుచేటు అన్నారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కేసీఆర్ 24 గంటలు రైతుకు ఉచిత కరెంట్ అందజేశారని రైతుల మోటార్లకు మీటర్లు పెడితే నాటి బిజెపి ప్రభుత్వం 30 వేల కోట్ల సబ్సిడీ ఇస్తామన్న లొంగలేదన్నారు. తన మెడ మీద తలకాయ ఉన్నంత వరకు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేది లేదని తెలంగాణలో కేసీఆర్ తిరస్కరించాడన్నారు. మళ్లీ మీరు తెలంగాణలో రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేందుకు ప్రయత్నిస్తూ 10 నుంచి 15 వేల కోట్ల రూపాయల వ్యాపారాన్ని అదానీ, అంబానీ లకు అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లకు కక్కుర్తి పడుతూ రైతుల మెడకు ఉరితాడు బిగిస్తుందన్నారు. మూడవ డిస్కం ఏర్పాటును బీఆర్ఎస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని, రైతుల పక్షాన ముందుండి పోరాడుతుందన్నారు. నిన్న జరిగిన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదని 3 గంటలు ఉంటే చాలని మాట్లాడడం రైతులను ఆగ్రహానికి గురి చేస్తుందన్నారు. ఇప్పటికే ఉన్న రెండు డిస్కంలకు రూ.54 వేల కోట్ల రుణం ఉందని అవే కష్ట కష్టంగా నడుస్తున్నాయని అది చాలదు అన్నట్లు కొత్త డిస్కం ఏర్పాటుతో ఉచిత విద్యుత్ ను రద్దు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయానికి వస్తే 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారంలో కొనుగోలు కేంద్రాలను మూసివేస్తామని అంటున్నారని అన్నారు. 2023లో కేసీఆర్ 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి డబ్బులు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు, సివిల్ సప్లయ్ అధికారుల అవినీతి కారణంగా మిల్లర్లు కొనలేక తాలు పేరు చెబుతూ బస్తాల సాకు చెబుతూ రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లాల వద్దనే రైతులు పడిగాపులు కాస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి ప్రతి గింజను కొనుగోలు చేయాలన్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఓటరు సవరణలో కొత్త ఓటర్లను చేర్చడంతో పాటు దొంగ ఓట్ల ఏరివేతలో ముందుండాలని, ఓటరు జాబితాలో తప్పులు లేకుండా నిజమైన ఓటర్లు ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకుడు ఉప్పల ఆనంద్ పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులకు అందుబాటులో పోలీసులు

### పనితీరు మెరుగు పర్చుకుని సాగాలి
### టెక్నికల్ సేవల కోసం డిజిపి టెక్ టీమ్ ఏర్పాటు
### పోలీస్ అధికారులతో డిజిపి ఆనంద్ సమీక్ష

హైదరాబాద్,మే30 : ఫిర్యాదుదారుల కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని డీజీపీ ఆనంద్ సూచించారు. సీసీటీఎన్ఎస్ వ్యవస్థ పనితీరు సరిగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ల నుంచి ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన డీజీపీ, పాత పద్ధతులను విడిచిపెట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి క్రమశిక్షణతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని డీజీపీ తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణపై ప్రతి అధికారి కట్టుబడి పనిచేయాలని సూచించారు. త్వరలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో, ఫుడ్ అడల్టేరేషన్ వింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. జూనియర్లు సీనియర్లకు గౌరవం ఇవ్వాలని, పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. టెక్నికల్ సేవల కోసం ప్రత్యేకంగా డీజీపీ టెక్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనర్లు క్రైమ్ రివ్యూ తప్పకుండా నిర్వహించాలని, యూనిట్ హెడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని డీజీపీ ఆనంద్ ఆదేశించారు.

# రాజస్థాన్‌లో ఇసుక తుఫాన్

### బలమైన ధూళితో చీకట్లు కమ్ముకున్న పలు జిల్లాలు
### భాయందోళనలకు గురైన ప్రజలు

జయపుర : రాజస్థాన్ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇసుక తుపాను తీవ్ర బీభత్సం సృష్టించింది. థార్ ఎడారి నుంచి వీచిన బలమైన గాలుల కారణంగా ఆకాశమంతా ఇసుక రేణువులు కమ్ముకొని, పగటిపూటే ఒక్కసారిగా చీకట్లు ముసురుకోవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ముఖ్యంగా పశ్చిమ రాజస్థాన్‌లోని చురు, బీకనీర్, హనుమాన్‌గఢ్, గంగానగర్ జిల్లాలపై ఈ తుపాను ప్రభావం తీవ్రంగా చూపింది. చురూ పరిసర ప్రాంతాల్లో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో భీకరమైన ఈదురు గాలులు వీచాయి. భారీ ఎత్తున లేచిన ఇసుక మేఘాలు యావత్ ప్రాంతాన్నీ చుట్టేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తీవ్రమైన ఇసుక తుపాను ముగిసిన వెంటనే వాతావరణం చల్లబడింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, అంతకుముందు సంభవించిన ఇసుక తుపాను సృష్టించిన బీభత్సం వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అంతకుముందు శుక్రవారం కూడా రాజధాని జైపూర్‌లో ఇలాంటి భీకర వాతావరణమే కనిపించింది. నిన్న ధోల్‌పుర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో మారుతున్న ఈ వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. జైపూర్‌లోని వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌లో ఈ తరహా ఇసుక తుఫానులు, ఈదురు గాలులతో కూడిన వాతావరణం మరో నాలుగైదు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇసుక తుఫాన్ కారణంగా రోడ్లు, వీధులు, హైవేలపై మొత్తం చీకటి కమ్మేసింది. బికనీర్ నగరం మొత్తం ఇసుక పొగతో నిండిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. స్థానికులు ఇళ్లు నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. ఇసుక దుమ్ముతో కూడిన గాలులు తీవ్రమవడంతో ఆ ప్రాంతంలో స్థానికులు భయంతో వణికిపోయారు. ఇసుక తుఫాన్ , తీవ్రమైన గాలులతో నగరంలో సాధారణ జన జీవనం ఒక్కసారిగా స్థంభించిపోయింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కు నిలిచిపోయింది. షాపులు మూసివేశారు దుకాణదారులు. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి.

# అవసరమైతే ఆపరేషనక సిందూర్-2

### పాక్‌ను మరోమారు హెచ్చరించిన ఆర్మీ చీఫ్

పుణె : పాకిస్థాన్‌కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది గట్టి హెచ్చరిక చేశారు. అవసరమైతే ఆపరేషన్ సిందూర్ 2.0కు భారత సైనిక బలగాలు సర్వ సన్నద్ధంగా ఉన్నాయని చెప్పారు. భూమి, ఆకాశం, సముద్రంలో అత్యాధునిక రీతుల్లో పోరాటానికి త్రివిద దళాలు సామర్థ్యం పెంచుకుంటున్నట్టు తెలిపారు. పుణెలో శనివారంనాడు జరిగిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ 150వ పాసింగ్ ఔట్ పరేడ్ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. శాంతి తాత్కాలికమేనని, అవసరమైతే ఆపరేషన్ సింధూర్ సెకెండ్ ఫేజ్‌కు కూడా త్రివిధ దళాలు పట్టుదలగా సర్వసన్నద్ధమవుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో జరుగబోయే యుద్ధాలు కేవలం భూమి, సుముద్రం, ఆకాశానికే పరిమితం కావని ద్వివేది అన్నారు. స్పేస్, సైబర్, కాగ్నిటివ్ డొమెయిన్లలోనూ యుద్ధ ప్రభావం ఉంటుందన్నారు. మోహరింపులు, ప్రొటక్షన్ చర్యలపై మిలటరీ వ్యూహకర్తలు అత్యంత అప్రత్తంగా ఉండాలని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన సత్తా చాటిందని, సైనకదళాలు కచ్చితత్వంలో దాడి చేయగలవని నిరూపించాయని చెప్పారు. భవిష్యత్ యుద్ధాల విషయంలోనూ ప్రజావిశ్వాసం, జాతీయ సమక్యత కీలకాంశాలుగా ఉంటాయన్నారు. దశాబ్ద కాలంగా బలగాల సామర్థ్యంలో అద్భుతమైన పరివర్తన చోటుచేసుకుంటోందని, ఇందులో యువత భాగస్వామ్యం కీలకంగా ఉందని అన్నారు. ఈ మార్పుల్లో భాగంగా డ్రోన్ బెటాలియన్లు, దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్లు, భైరవ్ బెటాలియన్లు, ఇతర టెక్నాలజీ ఆధారిత సైన్యాన్ని రూపొందిస్తున్నట్టు చెప్పారు. నెట్‌వర్గింగ్, డాటా-సెంట్రిసిటీ కీలకమైన వ్యూహాత్మక వనరులు కాబోతోందని అన్నారు. డ్రోన్ల వినియోగంపై అన్ని అకాడమీల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

# ఎసిబికి చిక్కిన సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్

### 4 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్ : సైబర్ నేరగాళ్ల ఆట కట్టించాల్సిన పోలీసే అడ్డంగా లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కాడు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బత్తుల మహేందర్ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ పట్టుబడ్డాడు. ఒక సైబర్ మోసం కేసులో బాధితుడి కుటుంబ సభ్యులను ఇరికించకుండా ఉండాలంటే... ఏకంగా 9 లక్షల రూపాయలు లంచం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మహేందర్ డిమాండ్ చేశాడు. ఇందులో భాగంగా బాధితుడి నుంచి ఇప్పటికే ఐదు లక్షల రూపాయల నగదును గుట్టుచప్పుడు కాకుండా వసూలు చేశాడు. మిగిలిన 4 లక్షల రూపాయల కోసం బాధితుడిని మరోసారి బెదిరింపులకు గురిచేశాడు. దీనితో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పక్కా ప్లాన్ ప్రకారం...శనివారం ఇన్‌స్పెక్టర్ మహేందర్ మిగిలిన 4 లక్షల రూపాయల లంచం డబ్బును తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ అరెస్ట్ అనంతరం అతడి అధికారిక నివాసంలో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని 13 లక్షల రూపాయల భారీ నగదుతో పాటు, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, కీలకమైన ఆస్తి పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మహేందర్ వెనకాల ఉన్న అక్రమ ఆస్తులపై ఏసీబీ అధికారులు మరింత లోతైన విచారణను కొనసాగిస్తున్నారు. లంచం కేసులో అరెస్టయిన నిందితుడిని అధికారులు నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.

# మరోమారు ఉగ్రదాడులకు యత్నం

### 9మందిని అరెస్ట్ చేసిన ఢిల్లీ స్పెషల్ పోలీసులు

న్యూఢిల్లీ,మే30 : దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉగ్రదాడులను సిద్ధమైన 9 మందిని ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో నిందితులకు సంబంధాలు ఉన్నాయని తెలిపారు. నిందితులు ఢిల్లీ, ముంబై, పంజాబ్ ప్రాంతాలకు చెందిన వారని చెప్పారు. వీరిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నారని అన్నారు. వారి నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అణుకేంద్రాలు, ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్లు, పవర్‌ఎ÷-లాంట్ వంటి కీలకమౌలిక వసతులను ఈ ఉగ్రవాదులు టార్గెట్ చేశారని పోలీసులు తెలిపారు. భద్రతా దళాలను కూడా వారు టార్గెట్ చేసే యోచనలో ఉన్నారని అన్నారు. ఉగ్రమూకపై గత కొంతకాలంగా నిఘా పెట్టి తాజాగా అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఈ కుట్రలో పాక్ పాత్ర ఏ మేరకు ఉందీ అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. నిధులు ఎవరు ఇస్తున్నారో? ఈ ముఠాకు విదేశీ హ్యాండ్లర్లు ఎవరో? తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఢిల్లీలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న సమాచారం నడుమ అక్కడి పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. నిఘా వర్గాల, కేంద్ర పారామిలిటరీ దళాలతో సమన్వయంతో అన్ని జిల్లా యూనిట్స్ హైఅలర్ట్‌లో ఉంటున్నాయి. ఇక గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో 15 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులందరూ ఉన్నత విద్యావంతులు కావడంతో పోలీసులు వైట్ కాలర్ ఉగ్రవాదంపై కూడా గట్టి నిఘా పెట్టారు.

# ధాన్యం కొనుగోలు పక్రియలో తీవ్ర జాప్యం

### ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతుల రాస్తారోకో

యాదాద్రి భువనగిరి,మే30 : ధాన్యం కొనుగోలు పక్రియలో తీవ్ర జాప్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని నమిలే గ్రామ రైతులు శనివారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండిపోవడం, తూకం పక్రియ ఆలస్యం కావడం, తరుగు పేరుతో ఇబ్బందులు పెట్టడం వంటి సమస్యలపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో రైతులు నమిలే క్రాస్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల నినాదాలతో ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి వారాల తరబడి ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల భయంతో రాత్రింబవళ్లు ధాన్యం కుప్పల వద్దే కాపలా కాస్తున్నామని తెలిపారు. వర్షం కురిస్తే ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతిని భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడం, గన్నీ సంచుల కొరత, రవాణా వాహనాల సమస్యల కారణంగా కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయని రైతులు ఆరోపించారు. ధాన్యం తూకం వేసిన తర్వాత కూడా మిల్లులకు తరలించడంలో ఆలస్యం జరుగుతోందని, దీంతో కొత్తగా వచ్చే రైతుల ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రాస్తారోకో కారణంగా కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు పక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే హామీలతో సరిపెట్టకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. కొనుగోళ్లు వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం

### ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం,మే30 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు విజయనగరం జిల్లా పార్టీ కార్యాలయంలో, రణస్థలంలో ఎప్పటికప్పుడు ప్రజాదర్బాలు నిర్వహిస్తున్నామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. శనివారం విజయనగరం పార్టీ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించారు. మిగతా వాటికి పరిష్కారం చూపాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని అధికారులకు సూచించారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి సేవలందించాలని, ప్రజలందరూ సంతోషంగా ఆనందంగా ఉండాలని కూటమి పెరుగుతూ లక్ష్యమని చెప్పారు.

## సంపాదకీయం

# జనాభా కాదు.. మౌళిక వసతులు ఆలోచించండి !

దేశంలో ప్రస్తుతం ఉన్న జనాభాకే సరైన మౌళిక సదుపయాలు లేవు. విద్య,వైద్యం అందించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అలాగే నిత్యావసరాలు అందడం లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దేశంలో అత్యధిక జనాభాకు కనీస గూడు కూడా కరువే. ఘనత వహించిన పాలకుల తీరు కారణంగా ప్రజలు నానా అగచాట్లు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా, వాటిని సకాలంలో సేకరించే యంత్రాంగం లేదు. ఉన్న జనాభాను పనులకు ఉపయోగించుకునే తెలివి లేకుండా పోయింది. ఇదంతా కూడా కేవలం వ్యవస్థాగత లోపంతో పాటు, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం, పరిపాలనానుభం లేకపోవడం ప్రధాన కారణంగా చూడాలి. ఇలాంటి సమయంలో ఈ మధ్య ఎపి సిఎం చంద్రబాబు పిల్లలను కనండి.. డబ్బులు పడేస్తాను అంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. తను ఒక్క కొడుకునే కన్నాడు. తన కొడుకు లోకేశ్ కూడా ఒక్క పిల్లాడిని కని మిన్నకున్నారు. చంద్రబాబు పిలుపు ఇంటికి పనికిరాదా అన్నది చెప్పాలి. కనీస మౌళిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు పనిచేస్తున్నారా అన్నది చెప్పాలి. ఇవేవీ కల్పించ కుండా పిల్లలను కని పడేసతే వారికి తిండి,బట్ట, చదువుసంధ్యా, వైద్యం ఎవరు అందిస్తారో చెప్పాలి. ఇందుకు గ్యారెంటీ ఇవ్వగలరా అన్నది చెప్పాలి. ఇప్పుడున్న పిల్లలకు ఈ రకమైన వసతులు కల్పించడానికి ఏం చేస్తున్నారో చంద్రబాబుతో సహా పాలకులంతా ప్రకటించాలి. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకుని వెళ్లే బదులు ఇలా తిరోగమనం వైపు తీసుకుని వెళ్లే యత్నంలో రాజకీయ కోణం తప్ప మరోటి లేదు. జనాభా నియంత్రణ లేకపోవడంతో దేశంపై ఎంతగా భారం పడుఉతందో చెప్పడం లేదు. ప్రజలు త్యాగాలు చేస్తుంటే... నాయకులు భోగాలు అనుభవిస్తున్నారు. కేవలం సీట్లు పెంచుకోవడం అన్న ధ్యాస తప్ప మరోటి లేదు. జనాభా పెరిగితే రేపటి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో కోత ఉండదన్న దురుద్దేశం ఇందులో దాగి ఉందనడంలో సందేహం లేదు. దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గిన కారణంగా నియోజక వర్గాల పునర్విభజన జరిగితే, నష్టపోతాం కనుక జనాభాను పెంచాల్సి ఉందని,అందుకు మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు నాయుడు సెలవిచ్చారు. ఎక్కడకు వెళ్లినా , కార్యక్రమం ఏదైనా జనాభా పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చబుతున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కనే మహిళలకు, పిల్లలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించారు. మూడవ సంతానానికి రూ.30 వేలు, నాల్గవ సంతానానికి రూ.40 వేలు నగదు సహాయం చేస్తామని, ఆర్థికాభివృద్ధి బాగుంటే మరింత ఎక్కువ ఇవ్వడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అసలు ఈ పిల్లలను కనడానికి కనీసం ఆస్పత్రి సౌకర్యాలు లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రావడం లేదు. ఎవరి ప్రయోజనాల కోసం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలో చెప్పాలి. పిల్లను కనడం వల్ల వచ్చే సౌలభ్యం ఏమిటో చెప్పాలి. ఈ ప్రోత్సాహకాలు ప్రకటించడం ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల్లో డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయం చంద్రబాబు గ్రహించినట్లు లేదు.ప్రోత్సాహకాలు మాత్రమే మహిళలు ఆరోగ్యంగా, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో పెరగడానికి అవకాశాలు కల్పిస్తాయని భరోసా ఇవ్వగలరా అన్నది చెప్పాలి. కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రామికులను సరఫరా చేయడానికి, మహిళలను ఇంటికి పరిమితం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగ పడుతుంది. దేశ జనాభా ఇప్పటికే విపరీతంగా పెరిగింది. బాల్యం అంతా వెట్టిలో సాగుతోంది. జనాభా పెరుగుదల దేశంలో అసమానతలను పెంచింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అభద్రత, హింస, అత్యాచారాలు, అశాంతి పెరిగినట్లుగా అన్ని గణాంకాలు, నివేదికలు తెలియచేస్తున్నాయి. మహిళల విద్య, ఉపాధి, పౌష్టికతకు సంబంధించిన అంశాలలో వెనకబడుతున్నాం. ఇటువంటి దుర్భర పరిస్థితులలో ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని సూచించడం ద్వారా గ్రామీణ కుటుంబాల్లో భారం మోపడం తప్ప మరోటి కాదు. పిల్లను కనడానికి సరైన ఆస్పత్రులు లేవు. పెంచడానికి సరైన భద్రత లేదు. పెంచిన తరవాత చదివించేం దుకు సరైన పాఠశాలలు లేవు. వారిని సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అనువైన వాతావరణం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే మహిళలు పిల్లల్ని కనే క్రమంలో శారీరక, మానసిక మార్పులు, ఒత్తిళ్లకు లోనుకావాల్సి ఉంటుంది. వాటిని అధిగమించడానికి అవసరమైన వైద్యం ఎక్కువ శాతం మహిళలకు అందుబాటులో లేదు. మరీ ముఖ్యంగా గ్రామీణ, గిరిజన మహిళలకు ఇలాంటి సమస్య ఎక్కువ. డోలీ లేకుండా గర్భిణిని తరలించే సౌకర్యం కల్పించని పాలకులు ఇఇ గుర్తుకు రావడం లేదు. సమాజంలో మార్పులు వస్తున్నా, ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగినా ఇంకా మహిళలలు అణచివేతకు గురవుతున్నారు. 21 ఏళ్లు నిండినప్పటి నుంచి మహిళల మీదపెళ్లి ఒత్తడి పెరుగుతంది. పెళ్లి అయితే పిల్లలను కనమని ఒత్తిడి కుటుంబ సభ్యుల నుంచి ఉంటుంది. ఇక ప్రోత్సాహకాలు ఇస్తున్నారంటే ఆ ఒత్తిడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే చాలా మంది మహిళలు కెరీర్, కుటుంబం రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారు. వెనకటికి లాగా ఉమ్మడి కుటుంబాలు లేవు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందరికీ అందుబాటులో ప్రభుత్వ అజమాయిషీలో తీసుకుని రావడంపై ముందుగా పాలకలు దృష్టి సారించాలి. ఇస్తామన్న ప్రోత్సాహక డబ్బు ఇందుకోసం వెచ్చించాలి. అందరూ ఉపాధిని హక్కుగా పొందగలిగేలా పరిస్తితిని సృష్టించాలి. స్కూళ్లతో పాటు ఆటస్థలాలు, పార్కులు, సాంస్కృతిక వికాసం కోసం లైబ్రరీలు, పాటలు, డాన్సులు నేర్పే సంస్థలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అప్పుడు జనాభా నియంత్రణను ఎవ్వరు కూడా పాటించరు.

# తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత




## ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతుపవనాలు

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవానలు కూడా ఆలస్యం అవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతోజూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారుజామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45 డిగ్రీలకుపై గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించు కోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు మధ్య తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలవనరుల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించింది. సంవత్సరం వానకాలం ఎల్‌నినో ప్రభావంతో 2018 మాదిరిగానే ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం మాదిరి వర్షాలను ఆశించవద్దని తెలంగాణ వెదర్‌మ్యాన్ సూచించారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు ఉంటాయని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. అయినప్పటికీ.. 2014-15లా సాధారణ వర్షపాతం 905.4 మి.మీ. కురువాల్సి ఉండగా కేవలం 562.1 మి.మీ. కురిసినంత తీవ్రంగా ఉండకపోవచ్చని తెలిపారు. గత 5-6 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రుతుపవన వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు తీవ్రంగా ఉంటుందని, మధ్య తెలంగాణలో మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ ఏడాది రెండో వారంలో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ఆరంభం ఉంటుందని చెప్పారు.

# ఆందోళనకరంగా నకిలీ నోట్ల చలామణి

## ఆర్‌బిఐ నివేదికలో పలు అంశాలు వెల్లడి

ముంబయి : దేశంలో నకిలీ నోట్ల అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దర్యాప్తు అధికారుల సోదాల్లో పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం. బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు 2025-26లో 5.7 శాతం పెరిగిందని భారత రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. దీనికి ఆన్‌లైన లేదా కరెన్సీ రహిత ప్రవాహం పెరగాలని సూచిస్తున్నారు. నోట్ల రద్దు చేసినా నకిలీ నోట్ల ముద్రణ ఆగడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ముఖ విలువ రూ.200, రూ.500 ఉన్న నోట్లే ఇందులో ఎక్కువగా వుంటున్నాయని తెలిపింది. 2025-26లో మొత్తంగా నకిలీ నోట్ల సంఖ్య 2,29,746కి పెరిగిందని, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 2,17,396గా వుందని ఆర్ బి ఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2024-25లో నకిలీ రూ.500 నోట్లు 20.5 శాతం పెరిగాయి. అంతకుముందు 1,17,722 గుర్తించగా, తర్వాత ఆ సంఖ్య 1,41,907కి చేరింది. అలాగే రూ.20 ముఖ విలువ ఉండే నోట్లు నకిలీ చలామణి కూడా బాగా పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. ఏడాది క్రితం 253 నోట్లు బయటపడగా అవి 47.4శాతం పెరిగి 373కి చేరాయి. ÷ఔ.200 నకిలీ నోట్ల సంఖ్య తగ్గింది. 2024-25లో 32,600 వుండగా, 2025-26లో 30,591కి పడిపోయింది. అలాగే వంద నోట్ల నకిలీ కూడా తగ్గింది. 51,069 నుండి 45,621కి పడిపోయింది. రూ.50నోట్లు నకిలీ కూడా 12,015 నుండి 10,274కి తగ్గింది. ÷ఔ.2 వేల నోట్లు చలామణి నుండి ఉపసంహరించడంతో వాటి నకిలీ దాదాపు పడిపోయిందని చెప్పవచ్చు. అంతకుముందు ఏడాదిలో 3508 బయటపడగా, 2025-26లో ఈ సంఖ్య 824కి తగ్గిపోయింది. ఆర్ బి ఐలో 2.4శాతం అంటే 5,412 నకిలీ నోట్లు కనుగొనగా ఇతర బ్యాంకుల్లో మొత్తంగా 97.6శాతం అంటే 2,24,334 నోట్లు కనుగొన్నారని నివేదిక పేర్కొంది. ఇంకా పోలీసులు, ఇతర ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నవి ఇందులో కలపలేదని తెలిపింది. పాడైపోయిన నోట్లను తీసివేయడం బాగా తగ్గిందని నివేదిక పేర్కొంది. 2025-26లో ఈ సంఖ్య 1.72లక్షల నోట్లుగా వుండగా అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 2.38 లక్షలుగా వుంది.

# బంగారానికి తగ్గుతున్న డిమాండ్

## మరోమారు స్వల్పంగా తగ్గిన ధరలు

ముంబయి,మే30 : దేశంలో బంగారానికి డిమాండ్ భారీగా పడిపోయింది. పసిడి విక్రయాలు 70 శాతం తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,640 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,44,500 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,18,230 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ. 600.. 22 క్యారెట్ల బంగారంపై రూ. 550 .. 18 క్యారెట్ల బంగారంపై రూ. 450 తగ్గింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,040 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,950 రూపాయల వద్ద.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,780 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# ఐపిఎల్‌లో అరుదైన ఘనత

## వరుసగా రెండుసార్లు హిట్ వికెట్‌గా సాయిసుదర్శన్

చండీఘడ్ : ఐపీఎల్-2026 సీజన్‌లో రెండుసార్లు సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. వరుస రెండు మ్యాచుల్లో ఇది జరిగింది. బెంగుళూరు, గుజరాత్‌లతో జరిగిన మ్యచ్‌లలో సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. ఇకపోతే క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ మరోసారి సత్తాచాటింది. రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని 3 వికెట్లు కోల్పోయి ఛేదించి, బెంగళూరుతో తుదిపోరుకు అర్హత సాధించింది. అయితే.. ఈ మ్యాచ్‌లో జీటీ ఓపెనర్ సాయి సుదర్శన్ ఔటైన తీరే చర్చనీయాంశమవుతోంది. బ్రిజేష్ శర్మ బౌలింగ్‌లో థర్డ్‌మ్యాన్ వైపు బౌండరీ కొట్టిన అనంతరం అతడి చేతిలోని బ్యాట్ జారి నేరుగా వికెట్లను తాకడంతో హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు క్వాలిఫయర్-1లో జరిగిన మ్యాచ్‌లోనూ ఆర్సీబీపై ఇదే తరహాలో ఔటయ్యాడు. దీంతో ఐపీఎల్‌లో వరుసగా 2 ఇన్నింగ్స్‌ల్లో హిట్ వికెట్‌గా వెనుదిరిగిన తొలి బ్యాటర్‌గా కోరుకుని రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు సాయి సుదర్శన్. మ్యాచ్ అనంతరం తాను ఔటైన తీరుపై సాయి సుదర్శన్‌కు ఓ ప్రశ్నకు అతడు సరదాగా స్పందించాడు. 'ఇకపై బ్యాట్ చేతికి అతుక్కుని ఉండేలా గ్రిప్ టెక్నిక్‌లు ఏవైనా ఉన్నాయేమో ప్రయత్నించాలి' అని నవ్వుతూ సమాధానమిచ్చాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన సాయి సుదర్శన్.. తొలి వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్ చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధికం. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మైక్ హస్సీ, మురళీ విజయ్ 159 పరుగులు జోడించగా.. ఆ రికార్డును వీరు అధిగమించారు. అంతేకాకుండా గిల్-సుదర్శన్ జోడీ మరో ఘనతనూ సొంతం చేసుకుంది. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధికంగా 100కు పైగా భాగస్వామ్యాలు నెలకొల్పిన జోడీగా అవతరించింది. వీరిరువురూ 11 సెంచరీ భాగస్వామ్యాలతో.. క్రిస్ గేల్-కోహ్లీ, బాబర్ ఆజమ్-మహ్మద్ రిజ్వాన్, డివిలియర్స్-కోహ్లీ జోడీలను వెనక్కి నెట్టారు. క మ్యాచ్ విషయానికొస్తే.. 215 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గిల్(53 బంతుల్లో 104) అద్భుత శతకంతో మెరిశాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులతో చెలరేగాడు. వీరి దూకుడుకు రాజస్థాన్ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. జీటీ చరిత్రలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం విశేషం. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్ఆర్ 20 ఓవర్లలో 214/6 పరుగులు చేసింది. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 47 బంతుల్లో 96 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆకట్టుకోగా.. రవీంద్ర జడేజా 45 పరుగులతో రాణించాడు.

# సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు


## కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటానన్న బాల్క

హైదరాబాద్,మే30 : బీఆర్‌ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్‌ను నాంపల్లి కోర్టుకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నించా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు.

# కుటుంబ బంధం అవసరం !

తిరుమల : ఆవు తనకు కట్టిన పలుపుతాడు తెంచుకొని వెళ్ళిపోవాలనుకుని అటు, ఇటు చుట్టూ తిరుగుతుంది. చివరకు తన పరిధి తాను తెలుసుకుని చతికిలపడుతుంది. మన నిస్సహాయతను మనం తెలుసుకోవాలి. అదే సమయంలో మనల్ని ఇలా ఉంచినవాడి గొప్పదనాన్ని గ్రహించాలి. ఎవరిమీదో కోపం వస్తుంది. ఎందుకో కోపం వస్తుంది. పారిపోవాలని అనిపిస్తుంది. తాళ్లతో కట్టి బంధించరెవరూ! అయినా వెళ్ళలేం. ఎందుకు, ఎవరు మనల్ని ఆపుతున్నారో తెలియదు. చూసిన ముఖాలే చూస్తూ, ఆడిన మాటలే ఆడుతూ, అదే తిండి తింటూ, నిద్రపోతూ తెల్లవారి లేచి మరో కొత్త సూర్యుడి కోసం ఎదురు చూస్తాం. ఇదే బంధం. మౌలికంగా మనిషి బతకడంలోనే బంధం ఉంది. అందం ఉంది. బంధాలు అందంగా ఉంటాయి. అవి ఇనుప గొలుసులైతేనేం, బంగారు గొలుసులైతేనేం- బంధాలు బయటకు కనిపించవు. తల్లి వెంట బిడ్డ, బిడ్డ వెంట తల్లి... ఆ బిడ్డ ఎదిగి తల్లి... అలా అందరూ కలిసి కుటుంబం. ఈ కుటుంబాలన్నీ ఈశ్వరుడివే. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మనసు వైరాగ్యానికి గురి అయినప్పుడు తట్టా బుట్టా సర్దుకుని ఎక్కడికైనా వెళ్ళిపోదాం అనిపిస్తుంది. కానీ, అంతలోనే ఆగిపోవాలి అనిపిస్తుంది. కనపడకుండా ఆపేదెవరని ఆలోచిస్తే- మనవాళ్లే కాదు... మనమధ్యలో ఉండే బంధమే అనిపిస్తుంది. కుటుంబ బంధం అంత బలమైనది. అందులోనే అందం, ఆనందం ఉంది.



ఆధ్యాత్మికం

# పొగాకు నెమ్మదిగా ప్రాణాలు తీసే విషం

**● ఒక్కరి అలవాటు కుటుంబమంతటికీ అనారోగ్యం ● మెడికవర్‌లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం**




**కరీంనగర్ టౌన్, మే30 (ది క్రైమ్ న్యూస్):** పొగాకు వాడకం కేవలం ఒక చెడు అలవాటు మాత్రమే కాదని, అది నెమ్మదిగా మనిషి ఆరోగ్యాన్ని కబళించే ప్రమాదకర విషమని వైద్యులు హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు పొగాకు, బీడీ, గుట్కా, తంబాకు వాడకం వల్ల కలిగే తీవ్ర ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్టు డాక్టర్ అనీష్ పబ్బ, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ పొగాకు వినియోగం నేరుగా గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. బీడీ, సిగరెట్, గుట్కా వంటి అలవాట్లు రక్తనాళాలను దెబ్బతీసి గుండెపోటు, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తాయని వివరించారు. కొంతమంది ఒత్తిడి తగ్గించుకోవడానికి లేదా సరదాగా పొగ తాగడం ప్రారంభిస్తారని, కానీ అదే తర్వాత ప్రాణాంతక అలవాటుగా మారుతుందని చెప్పారు. నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్న వారిలో అధిక శాతం మంది పొగాకు వినియోగదారులేనని తెలిపారు. ప్రస్తుతం యువతను లక్ష్యంగా చేసుకుని పొగాకు ఉత్పత్తుల తయారీ సంస్థలు ఆకర్షణీయ ప్రచారాలు నిర్వహించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఫ్లేవర్స్ కలిపిన పొగాకు పదార్థాలు, కొత్త రూపాల్లో అందుబాటులోకి తీసుకురావడం వల్ల యువతతో పాటు చిన్నపిల్లలు కూడా వీటి వైపు ఆకర్షితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాషన్‌గా మొదలైన పొగతాగే అలవాటు చివరికి వ్యసనంగా మారి ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితిని, కుటుంబ బంధాలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ఒక ఇంట్లో ఒక వ్యక్తి పొగతాగితే దాని ప్రభావం అతడికే పరిమితం కాదని, కుటుంబ సభ్యులపై కూడా తీవ్రంగా పడుతుందని హెచ్చరించారు. పొగతాగే వ్యక్తి విడుదల చేసే పొగను పీల్చడం వల్ల పిల్లలు, మహిళలు, వృద్ధులు, గర్భిణులు పరోక్షంగా అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం అధికమని వెల్లడించారు. చిన్నారుల్లో శ్వాసకోశ సమస్యలు, అలెర్జీలు, ఊపిరితిత్తుల ఇబ్బందులు పెరిగే అవకాశం ఉందన్నారు. బీడీ కార్మికులు కూడా అధిక సంఖ్యలో క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్న పరిస్థితి ఆందోళనకరమని అన్నారు. చెడు అలవాట్లను జీవితంలోకి రానివ్వకుండా యువత జాగ్రత్త పడాలని, ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని వైద్యులు పిలుపునిచ్చారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, అబ్దుల్ వకీల్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# ఆనందోత్సాహాల నడుమ మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు

**● ఎస్.ఎస్. అన్వర్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు**







**మంథని, మే 30(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినోత్సవాన్ని కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.ఎస్. అన్వర్ నేతృత్వంలో శనివారం కమాన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమం ప్రజల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి కేక్ కట్ చేసి మంత్రి శ్రీధర్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రాజకీయ వేడుకలను సేవా కార్యక్రమాలతో మేళవించడం ద్వారా సమాజానికి సానుకూల సందేశాన్ని అందించారని స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్‌బాబు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక రంగ పురోగతి, యువత ఉపాధి అవకాశాల కల్పనలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్న నాయకుడి జన్మదినాన్ని సేవా కార్యక్రమాల మధ్య నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఆదివరాహ దేవస్థానం పాలకవర్గ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెలిచాల ప్రజా కార్యాలయంలో ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు





**కరీంనగర్ టౌన్, మే30(ది క్రైమ్ న్యూస్):** కొత్తపల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో శనివారం ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న కాంగ్రెస్ నాయకులు కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు సీట్లు పంపిణీ చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు పేదల పెన్నిధి అని మంథని నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. వైయస్సార్ శిష్యునిగా వైఎస్ కిరణ్ కుమార్ రెడ్డి రోశయ్య మంత్రివర్గంలో పనిచేశారని ప్రస్తుతం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో కీలక మంత్రిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పీవీ నరసింహారావు రికార్డును అధికమించారని మంథనితోపాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో కీలకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తున్నారని తండ్రికి తగ్గ తనయుడుగా పేరు సంపాదించు కున్నారని తెలిపారు. సేవే ధర్మమని ప్రధాన లక్ష్యంతో రాజకీయాలకు వచ్చి ప్రజల మన్ననలు పొందుతూ శ్రీధర్ బాబు అత్యుత్తమ లీడర్‌గా మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ దేశాల నుంచి లక్షలాది రూపాయల పెట్టుబడులను తెలంగాణ రాష్ట్రానికి తీసుకొస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్ర అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల రమణారావు, వేల్పుల వెంకటేష్ గండి రాజేశ్వర్, సరిల్ల రతన్ రాజు, వెలిచాల రాజేందర్ రావు యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్ నాయకులు మిడిదొడ్డి కపిల్ మాధవ్, గండి శ్యామ్, గండి గణేష్ లక్ష్మణ రాజు రాజేష్ కనకరాజు బాలబద్రి శంకర్ తోపాటు పలువురు నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పిలుపు మేరకు కొత్తపల్లి మండలంలోని ఆరు గ్రామాల్లో మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సర్పంచులు పార్టీ శ్రేణులు కార్యకర్తలు కేక్ కటింగ్ చేసి వేడుకలు నిర్వహించారు. చింతకుంటలో మాజీ ఎంపిటిసి పట్టెం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు.

# లింగంపల్లి అప్పారావు దంపతులను సన్మానించిన యోగ గురూజీ నాళ్ల శ్రీనివాసరావు



**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్): మే 30:** యోగా నిత్య సాధన కమిటీ వారి ఆధ్వర్యంలో యోగ గురూజీ శ్రీనివాసరావు వారి ఆధ్వర్యంలో మధిర పట్టణంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు శనివారం నాడు పదవీ విరమణ చేస్తున్న లింగంపల్లి అప్పారావును యోగాసభ్యులు అందరూ కలిసి ఘనంగా లింగంపల్లి అప్పారావు దంపతులను సన్మానించారు. యోగ గురుజి నాళ్ళ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ లింగంపల్లి అప్పారావు అందరి మనిషి, రిటైర్డ్ వయస్సు వచ్చినా కూడా ఇప్పటికీ మంచి హుషారుగా ఉంటూ అనేక రకమైన సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతుంది అని ఇటువంటి వ్యక్తిని భగవంతుడు అన్ని రకాలుగా ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఉంచాలని కోరారు. అలాగే టీచర్ మల్లా రాజు మాట్లాడుతూ లింగంపల్లి అప్పారావు చేసిన సేవా కార్యక్రమాలను తెలుపుతూ, కొనియాడారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు, సాధకులు ఆర్టీసీ రాజు, స్వర్గం శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, కిషోర్, విశ్వేశ్వరరావు, మందడపు రామారావు, పసుపులేటి శ్రీనివాసరావు, సత్యనారాయణ, వెంకట రావు, తిరుపతిరావు, టీచర్ రాజు, మల్లా రాజు, జ్యోతి, శ్రీదేవి, లక్ష్మి, సంధ్య, శ్రావ్య, సహస్ర, జ్యోతి, హర్ష, నాగేశ్వరమ్మ, రమ్య, డాక్టర్ పృధ్వి దంపతులు తదితరులు పాల్గొని లింగంపల్లి అప్పారావు దంపతులను ఘనంగా సన్మానించడం జరిగింది. తదుపరి యోగ సభ్యులందరికీ లింగంపల్లి అప్పారావు మాట్లాడుతూ నేను ఈ రోజున ఇంత ఆరోగ్యంగా ఉండటానికి కారణం యోగానే అని తెలిపారు. తదుపరి అల్పాహారం అందించినారు.

# వి ఓ ఏ ల సమస్యలు పరిష్కరించాలి

**ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.సితారామయ్య**



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వి ఓ ఏల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు)రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. సీతారామయ్య,జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వి ఓఏల సమస్యలు పరిష్కారం కై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా ఇల్లందు ఐకెపి కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని శనివారం ఐ ఎఫ్ టి యు నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడాతు వి ఓ ఏల సమ్మెకు ఐ ఎఫ్ టి యు సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. 13 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చెవిటి వాడి ముందు శంఖం వూదిన చందంగా, దున్నపోతుమీద వర్షం కురిసినట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఓట్ల ముందు మహిళలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక వాగ్దానాలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత మోసం చేసిందని విమర్శించారు. కనీస వేతనం నెలకి 32,000 ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, 20లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారిని సిసి లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను ఐక్యంగా కొనసాగించాలని, పోరాటాన్ని ఉధృతం చేయాలని, ఐ ఎఫ్ టి యు మీకు అండగా నిలబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు ఇల్లెందు ఏరియా కమిటీ కార్యదర్శి డి.మోహన్ రావు, నాయకులు పల్లి సుధాకర్, వి ఓ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క నిప్పురవ్వ.. రైతు భవిష్యత్తునే బూడిద చేస్తుంది!



**నల్గొండ, మే 30 (ది క్రైమ్ న్యూస్):** వరి కొయ్యలను కాల్చవద్దని జిల్లా కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. గిరక బావిగూడెం గ్రామంలోని వ్యవసాయ పొలాలను సందర్శించిన ఆయన రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేడు కొయ్యలను కాల్చడం వల్ల రేపటి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. భూమి సారాన్ని కాపాడుకోవాలంటే కొయ్యలను కాల్చకుండా యంత్రాల సహాయంతో నేలలో కలపాలని సూచించారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాలు: భూమి సారం తగ్గిపోతుంది. ఎరువుల వినియోగం, ఖర్చు పెరుగుతుంది. నేల నాణ్యత దెబ్బతింటుంది. పంట దిగుబడి తగ్గుతుంది. వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. రోడ్లపై పొగమంచు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, వరి కొయ్యలను కాల్చి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులకు సూచనలు అందిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతు మాట్లాడుతూ, ఇకపై కొయ్యలను కాల్చబోమని, ఇతర రైతులకు కూడా ఈ విషయంపై అవగాహన కల్పిస్తామని అధికారులకు హామీ ఇచ్చారు. “పర్యావరణాన్ని కాపాడుదాం.. రైతు భూమిని రక్షిద్దాం..!” అంటూ అధికారులు రైతులకు పిలుపునిచ్చారు.

# సుల్తానాబాద్‌లో ఘనంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**మున్సిపల్ ఆవరణలో కేక్ కట్ చేసిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు**

**ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు నిర్వహణ**



**సుల్తానాబాద్, మే 30(ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ ఆవరణలో ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి, మంథని శాసనసభ్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ, మంత్రి శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో మంత్రిగారు మరింత ముందుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో సుల్తానాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరి మహేందర్, గర్రెపల్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ కల్లేపల్లి జానీ, కాంగ్రెస్ నాయకులు కుమార్, కిషోర్, పెగడ పరశురాం, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మెప్మా సంఘం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు జన్మదినం సందర్భంగా అంబలి పంపిణీ

**ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**





**మంథని, మే 30(ది క్రైమ్ న్యూస్):** వేసవి తీవ్రత నేపథ్యంలో ప్రజలకు చల్లదనాన్ని అందించాలనే లక్ష్యంతో లిఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు మల్యాల శేఖర్ గౌడ్‌లి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్య అంబలి పంపిణి కార్యక్రమం శనివారం ప్రత్యేకంగా నిర్వహించబడింది. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపల్లె ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అంబలి పంపిణి చేశారులి. వేసవి వేడిలో ప్రజలకు ఉపశమనం కలిగించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంది. మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణ రాజకీయాల్లో ప్రజలకు చేరువైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూ యువత ఉపాధి, పారిశ్రామిక ప్రగతి, సాంకేతిక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అంబలి పంపిణి కార్యక్రమానికి సహకరించిన సిద్దిపల్లె ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్‌కు ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని వారు ఆకాంక్షించారు. ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు మల్యాల శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నిత్య అంబలి పంపిణి కార్యక్రమం నిరంతరం కొనసాగుతోంది. సేవాభావంతో ప్రతి రోజు ప్రజలకు అంబలి పంపిణి చేస్తూ యువసేన సభ్యులు ప్రజల ఆదరణ పొందుతున్నారు.

# కేసుల దర్యాప్తులో పారదర్శకత, నాణ్యత ముఖ్యం

**● రామగుండం పోలీస్ కమిషనరేట్ సీపీ అంబర్ కిషోర్ ఝూ ● పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం**





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** కేసుల దర్యాప్తులో పారదర్శకత, నాణ్యత ముఖ్యమని రామగుండం పోలీస్ కమిషనరేట్ సీపీ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2025 సంవత్సరానికి ముందు నమోదై దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణ, అరెస్టులు, సాక్ష్యాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రాపర్టీ, బాడిలీ అఫెన్స్ కేసుల దర్యాప్తును పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. గ్రేవ్ కేసుల పురోగతిని డీసీపీలు, అదనపు డీసీపీలు వారానికి 1 సారి సమీక్షించాలని ఆదేశించారు. ఆర్థిక నేరాల కేసుల్లో చట్టప్రకారం నిందితులకు సంబంధించిన ఆస్తులను జప్తు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. కిడ్నాపింగ్, మిస్సింగ్ కేసుల్లో బాధితులను గుర్తించడంలో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని, అలాంటి కేసుల్లో ఆలస్యం ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను న్యాయస్థానం అనుమతితో త్వరితగతిన నిర్వీర్యం చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్, ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థులు ఉన్నట్లయితే వారిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, కన్విక్షన్ శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాల్లో భాగంగా అక్రమ ఇసుక రవాణా, గుడుంబా తయారీ, పేకాట తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని, ప్రజల నుంచి నేరుగా అందే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. సీపీ కార్యాలయం ద్వారా వచ్చే ఫిర్యాదులపై కూడా వేగంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులను సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, విధి నిర్వహణలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. కార్యాలయాలు, విధి నిర్వహణ ప్రాంతాల్లో హెల్మెట్ లేకుండా ఎవరికీ అనుమతి ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ అడ్మిన్ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎసఐలు పాల్గొన్నారు.

# అల్ ఇన్ వన్ కారోబార్: నేనే సర్పంచ్... నేనే కార్యదర్శి!

**● లలితపూర్ గ్రామంలో కారోబార్ హన్మంతు ఇష్టారాజ్యం ● వసూలు చేసిన పన్నులు జీపీ ఖాతాకు జమ కాలేదు**
**● ఆన్‌లైన్‌లో కనిపించని ఇంటి పన్నుల వివరాలు ● కారోబార్‌ను వెంటనే తొలగించాలని గ్రామస్తుల డిమాండ్**




**కరీంనగర్ టౌన్, మే30(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల పరిధిలోని లలితపూర్ గ్రామ పంచాయతీలో కారోబార్ హన్మంతు వ్యవహార శైలిపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గ్రామ పంచాయతీలో తానే సర్పంచ్, తానే కార్యదర్శి అన్నట్లుగా ఆయన 'అల్ ఇన్ వన్' పాత్ర పోషిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ ట్రాక్టర్ నడపడం దగ్గర నుంచి ఇంటి పన్నులు వసూలు చేసే వరకు అన్ని తానై వ్యవహరిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇటీవల ఎన్నికల సమయంలో గ్రామంలో ఇంటి పన్ను, లైబ్రరీ పన్ను, నీటి పన్ను, పారిశుధ్య పన్నుల పేరిట రకరకాలుగా ప్రజల నుండి భారీగా నగదు వసూలు చేశారు. అయితే, ఇలా వసూలు చేసిన పన్నుల మొత్తాన్ని గ్రామ పంచాయతీ అధికారిక ఖాతాకు లెక్క చూపకుండా పక్కదారి పట్టించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యతాయుతంగా ఇంటి పన్నులు కట్టిన గ్రామస్తులు డిజిటల్ రికార్డుల కోసం ఆన్‌లైన్‌లో తమ ఇంటి నెంబర్లు సరిచూసుకోగా, ఎక్కడా వారి పన్ను చెల్లింపుల వివరాలు నమోదు కాకపోవడంతో ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. తమ సొమ్ము దుర్వినియోగం అయిందని గ్రహించి ఆందోళన చెందుతున్నారు.ఒకే ఇంట్లో భార్య ఆశా వర్కర్‌గా, భర్త కారోబార్‌గా ఉంటూ గ్రామాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నారని, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్న హన్మంతును వెంటనే కారోబార్ విధుల నుండి తొలగించాలని లలితపూర్ గ్రామ ప్రజలు ఉన్నతాధికారులను గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ అవినీతి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజా ధనాన్ని రక్షించాలని వారు కోరుతున్నారు.

# మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు: దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, చాదర్ సమర్పణ





**కరీంనగర్ టౌన్, మే30(ది క్రైమ్ న్యూస్):** ప్రజల ఆశాజ్యోతి, బడుగు బలహీన వర్గాల నాయకుడు, ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్ ఆధ్వర్యంలో నగరంలోని కరీముల్లా షా దర్గాలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో పూల చాదర్ సమర్పించి, మంత్రి శ్రీధర్ బాబు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక దుఆ (ప్రార్థన) చేశారు. అనంతరం అక్కడ ఉన్న వారికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ విచ్చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ తాజోద్దీన్ మాట్లాడుతూ: "శ్రీధర్ బాబు నిరంతరం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలి. మాలాంటి సీనియర్ కార్యకర్తలను గుర్తించి, నామినేటెడ్ పోస్టులు వచ్చేలా వారు కృషి చేస్తారని ఆశిస్తున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, రాబోయే మరో పదేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉండేలా వారు నడిపిస్తారనే నమ్మకం మాకుంది." అని పేర్కొన్నారు. పాల్గొన్న ముఖ్య నాయకులు: ఈ కార్యక్రమంలో మైనారిటీ కాంగ్రెస్ నాయకులు నేహాల్ అహ్మద్, ఎండీ కలిమోద్దీన్, లేయిక్ ఖాద్రీ, ఎండీ చాంద్, సుంకరి గణపతి, రాజ్ కుమార్, జమీలోద్దీన్, షాహీన్షా, హనీఫ్, అహ్మద్ బషీర్, అబ్దుల్ బారి, షబానా, మహమ్మద్ ఆరిఫ్ ఖాన్, జాఫర్, అజీం, ఫజల్ పాషా భాయ్, ఎండీ సలీం, గోపాల్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మధిర పట్టణంలో సిసి రోడ్లు శంకుస్థాపన

**పట్టణంఅభివృద్ధి చేయటం ప్రధాన లక్ష్యం: మున్సిపల్ చైర్ పర్సన్ సామనేని సుజాత**





**మధిర, ప్రతినిధి మే 30(ది క్రైమ్ న్యూస్):** మధిర పట్టణంలో 4వ వార్డుల్లో నందిగామ బైపాస్ మెయిన్ రోడ్ నుండి ముస్లిం ఖాభారస్థాన్ వరకు రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు (సిమెంట్ కాంక్రీట్ రోడ్డు)పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత స్థానిక కౌన్సిలర్లు, అధికారులతో కలిసి శనివారం నాడు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ సుజాత మాట్లాడుతూ, మధిర పట్టణాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వార్డుల్లో డ్రైనేజీ, సిసి రోడ్ల వంటి కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు నిర్మాణ పనుల్లో ఖచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, పనుల పర్యవేక్షణలో స్థానికులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, వైస్ చైర్మన్ కోన దని కుమార్, కౌన్సిలర్లు దోర్నాల శిరీష, బోడెపుడి రేవతి,షేక్ రషీదున్, నకిరికంటి భాగ్యలక్ష్మి, వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, ములకలపల్లి వినయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ నాయకులు బెజవాడ రవిబాబు, కాంగ్రెస్ నాయకులు రంగా శ్రీనివాసరావు, పారుపల్లి విజయ్ కుమార్, తలుపుల వెంకటేశ్వర్లు, మిర్యాల వెంకటరమణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మడుపల్లిలో అక్రమ మట్టి తోలకాలు

**రోజురోజుకు పెట్రేగిపోతున్న మట్టి మాఫియా**

**రాత్రివేళ మట్టి అనుమతి లేదు ఏడి నాగ బ్రహ్మయ్య**

**మట్టి తోలు కాలు చేపడితే పీడీ యాక్ట్ కేసు నమోదు**



**మధిర, ప్రతినిధి మే 30(ది క్రైమ్ న్యూస్):** మధిర మండలంలో మట్టి మాఫియా రోజురోజుకీ పెట్రేగిపోతుంది. గత మూడు రోజుల నుండి మడుపల్లి చెరువు నుండి మట్టి మాఫియా రాత్రి వేళలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా వ్యాపార సముదాయాలకు, రియల్ ఎస్టేట్ భూములకు మరియు ఆంధ్రాకి, తరలిస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన ఐబీ అధికారులు నిద్ర నటించడంతో మట్టి మాఫియా చెలరేగి పోతుంది. అర్ధరాత్రి మట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల రణ గణ ధ్వనితో మడుపల్లి ప్రజలు నిద్రలేమి రాత్రులు గడుపుతున్నారని ఆ గ్రామ ప్రజలు మీడియాకు తెలిపారు. అక్రమ మట్టి రవాణాపై అధికారులకు ఫిర్యాదు చేస్తే, ఫిర్యాదు చేసిన వ్యక్తిపైటి మట్టి మాఫియా దాడికి పాల్పడింది. మట్టి మాఫియా ఆగడాల వల్ల మధిరలో శాంతి భద్రతలకు విఘాతం కలుగు తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి మాఫియా పై పిడి కేసులు పెడతాం రాత్రి వేళలో మట్టి తోలకాలకు అనుమతి లేదు ఐబి డిఈ రామబ్రహ్మం రాత్రి వేళలో చెరువుల్లో నుండి మట్టి తోలకాలు చేపడితే వారిపై పిడి కేసులు పెడతామని ఐబీ డీఈ నాగబ్రహ్మం మీడియాకు తెలిపారు. చెరువులో మట్టి తీసుకొని వెళ్లేందుకు రైతులకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉన్నదని ఆయన తెలిపారు. అనుమతి తీసుకున్న రైతులు చెరువు మట్టి పంట పొలాలకు మాత్రమే తరలించాలన్నారు. రియల్ ఎస్టేట్ భూములకు కానీ, వ్యాపార సముదాయాల గానీ, ఆంధ్ర ప్రాంతానికి గాని తరలిస్తే అటువంటి వారిపై పిడి కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

## రసమయిని విమర్శించుడుగాదు హామీల విఫలంపై జనాలకు సమాదానం చెప్పుర్రి: పాకాల మహిపాల్ రెడ్డి



**బెజ్జంకి, మే30(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ...రైతులకు రుణమాఫీ కాక ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోవడంపై సమాధానం చెప్పాల్సిన కాంగ్రెస్ నాయకులు ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, పదవి ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడుతున్న రసమయిని విమర్శిస్తూ తమ అహంకారాన్ని వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ నాయకులపై విమర్శలు మాని హామీలు అమలు చేయడంలో విఫలంపై జనాలకు సమాదానం చెప్పాలని లేదంటే రానున్న రోజుల్లో కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజలకు అండగా నిలిచి ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పదని మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.పార్టీ సర్పంచులు శ్రీధర్, భీమయ్య, మోహన్, నాయకులు లింగాల లక్ష్మణ్, మహేందర్ రెడ్డి, నరేష్ పటేల్, లక్ష్మారెడ్డి, మల్లేశం, శేఖర్ బాబు, శివ, సుదర్శన్, తిరుపతి, పరశురాములు, కత్తి నరసయ్య, బండారు రాములు, మహేష్,దొంతర వేణి ఓదెలు, శంకర్, శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుని కుటుంబానికి బీఆర్ఎస్ నేత ఆర్థిక సహాయం

**కుటుంబానికి భరోసా కల్పించిన వ్యాళ్ల హరీష్ రెడ్డి**



**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం కార్పొరేషన్ 57వ డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు గులాబ్ ముస్తఫా(అబ్బు) ఇటీవల గుండె పోటు తో మరణించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి శనివారం పార్టీ నాయకులతో కలిసి గులాం ముస్తఫా ఇంటికి వెళ్లారు. కుటుంబాన్ని కలిసి సానుభూతి ప్రకటించారు. వ్యాళ్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. ఇదే క్రమంలో ఆ కుటుంబానికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని సూచించారు. ఫౌండేషన్ తరపున తన వంతుగా చేయూతను అందించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జహీద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణ, చొప్పరి శ్రీనివాస్, పర్ష స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## మధిర హై కేర్ హాస్పిటల్ నందు రక్తదానం శిబిరం ఏర్పాటు




**మధిర, ప్రతినిధి మే 30(ది క్రైమ్ న్యూస్):** మధిర పట్టణంలో హై కేర్ హాస్పిటల్ నందు రూడీ మెమోరియల్ ట్రస్ట్ ,ఎస్ జె ఎస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తల సేమియా తో బాధపడుతున్న చిన్నపిల్లలు మరియు రోగుల్ని ఆదుకోవడానికి రక్తదాన శిబిరా (మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్) శనివారం నాడు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని హై కేర్ హాస్పిటల్ డాక్టర్ జంగా నవీన్ రెడ్డి మధిర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుమాటి నవీన్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రక్తదానం గురించి అవగాహన కల్పించారు. మీరు దానం చేసే ప్రతి చుక్క రక్తం ఒక ప్రాణం నిలబెట్టగలదు. రక్తదానంతో మీరు గొప్ప సహాయం చేయగలరు. రక్తాన్ని తయారు చేయలేము, కేవలం దానం చేయగలం. మీ రక్తం దానం చేయండి, ఒకరి జీవితాన్ని వెలిగించండి. రక్తదానం చేసి ఇతరులకు స్ఫూర్తినివ్వండి. ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. రక్తదానం సురక్షితం, ఆరోగ్యకరమైనది ఈ కార్యక్రమంలో హై కేర్ హాస్పిటల్ అధినేత జంగా ప్రవీణ్ రెడ్డి డాక్టర్లు సుబ్రహ్మణ్యం, ఉదయ్ కిరణ్ రెడ్డి ,సాయి మిధున హర్ష, అక్బర్ కిచెన్ అధినేత అక్బర్ , మధిర మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాలిక సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైలవరపు చక్రి ,కాజా మోహినుద్దీన్, ఉపేందర్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువతీ యువకులకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పెద్దపల్లి జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా యువతకు ఉపాధి మార్గాలను సుగమం చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం కింద ప్రధానంగా ఐటీఈఎస్, లాజిస్టిక్స్, టెలికాం, వ్యవసాయం గృహోపకరణ, దుస్తుల తయారీ, అందం, సంరక్షణ, టూరిజం, హాస్పిటాలిటీ, ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, హెల్త్ కేర్ ,వంటి రంగాలలో నైపుణ్యాలను అందించడం జరుగుతుంది. శిక్షణ అనంతరం అర్హులైన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని,పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆసక్తి గల నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు కోసం కరీంనగర్ లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చు అని పూర్తి వివరాల కోసం 9441174822 నంబరు నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా పెద్దపల్లి జిల్లా

**• ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 34,620 మంది మహిళలు అక్షరాస్యత పరీక్షల్లో ఉత్తీర్ణత**
**• మహిళలపై అఘాయిత్యాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని ప్రతిజ్ఞ • జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనతో పాటు మహిళా సాధికారత, అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన కార్యక్రమాలు విశేష ఫలితాలను సాధించాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్నేహ కిశోర బాలికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మాక్ పార్లమెంట్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ప్రజలతో చర్చించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విధానాలను రూపొందించడమే ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనమని అన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు లేకుండా బలవంతంగా తీసుకువచ్చే మార్పులు ఎక్కువ కాలం నిలవవని పేర్కొన్నారు. మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని అన్ని మహిళా సంఘాలలో చదువు రాని మహిళలను ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదు చేసి, 5 వేల మంది వాలంటీర్ల సహకారంతో అక్షరాస్యత బోధించడం జరిగిందన్నారు. మార్చి నెలలో నిర్వహించిన పరీక్షలకు 34,620 మంది మహిళలు హాజరై 100 శాతం ఉత్తీర్ణత సాధించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. రాబోయే జూలై నెలలో మిగిలిన 35 వేల మంది మహిళలకు కూడా పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, వాలంటీర్లు, మహిళా సంఘాల సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పెద్దపల్లి జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్



కార్పొరేషన్, 14 మండలాల పరిధిలోని 263 గ్రామ పంచాయతీలలో ఎక్కడా బాల్య వివాహాలు జరగడం లేదని ధృవీకరిస్తూ పెద్దపల్లి జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా ప్రకటించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలు, వేధింపులు, వివక్షను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళల భద్రత, గౌరవ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత అధికారులు, స్నేహ కిశోర బాలికల సంఘం సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలి

**• సిపిఐ ఎంఎల్ మాస్ లైన్**

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్. నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలని శనివారం తిరుమలాయపాలెం తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ( ప్రజాపంథా) పార్టీ జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ధరలు విపరీతంగా పెంచిందని, పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడల్ ఆయిల్ ధరలు తగ్గినా కూడా భారతదేశంలో ఆయిల్ ధరలు తగ్గించడం లేదని, పెట్రోల్, డీజిల్ పంట గ్యాస్, నిత్యవసర సరుకులు ధరలు పెరగటం వలన పేద, మధ్యతరగతి వర్గాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని నాగేశ్వరరావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆర్ గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని, అరులైన నిరుపేదలకి ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లకు 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు. రాష్ట్ర ప్రభుత్వ ఐదు లక్షలు ఇవ్వాలని, 2000 నుండి 4000 వరకు పెంచిన పెన్షన్లు ఇస్తానని ఇంతవరకు ఇవ్వలేదని తక్షణమే 4000 రూపాయలు ఇవ్వాలని, వికలాంగులకు 6000 రూపాయలు ఇవ్వాలని, కొత్త వారందరికీ రేషన్ కార్డు ఇవ్వాలని తదితర డిమాండ్లతో శనివారం



తిరుమలాయపాలెం డిప్యూటీ తాసిల్దార్ సుధీర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకులు ఎడ్లపల్లి నవీన్, బానోత్ శంకర్, పులిగుజ్జు వెంకటస్వామి, రాయల రాజా, గోకినపల్లి సరోజిని, వార్డు మెంబర్ ఆశీర్వాదం, రాయిండ్ల చిరంజీవి, రాయల వీరస్వామి, నామ వీరభద్రం, వడ్లపూడి వెంకయ్య,. గోకినపల్లి మంగ, మీగడ సత్యం, తుపాకుల రాజేశ్వరరావు, లాలయ్య, వెంకన్న, ఉసిల నరసయ్య, గోకినపల్లి వెంకన్న, రమణ బోయిన నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి

**• వాస్తవ సమాచారాన్నే ఎన్యూమరేటర్లకు అందించాలి • సర్వేలో ఇచ్చే సమాచారంతో సంక్షేమ పథకాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు • క్యాంపు కార్యాలయంలో హౌస్ లిస్టింగ్ సర్వేలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జనాభా గణన-2027లో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించి ఎన్యూమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హౌస్ లిస్టింగ్ సర్వేలో పాల్గొని ఎన్యూమరేటర్‌కు అవసరమైన వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ సర్వే జనాభా గణన-2027లో అత్యంత కీలకమైన దశ అని తెలిపారు. ప్రతి ఇంటి నిర్మాణం, గృహ సౌకర్యాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య సదుపాయాలు, విద్యుత్, వంట ఇంధనం, కమ్యూనికేషన్ సౌకర్యాలు తదితర వివరాలను ఈ సర్వే ద్వారా నమోదు చేస్తారని చెప్పారు. సర్వే ద్వారా సేకరించే సమాచారం ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో సహకరించి సరైన వివరాలను అందించాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఈ సమాచారంతో ఏ సంక్షేమ పథకం రద్దు కావడం గానీ, లబ్ధిదారుల అర్హతలు ప్రభావితమవడం గానీ జరగదని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి అపోహలకు తావివ్వకుండా సర్వే



సిబ్బందికి సహకరించాలని కోరారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు, పర్యవేక్షకులు నిబంధనల ప్రకారం ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను నమోదు చేయాలని, సర్వేను పారదర్శకంగా, నాణ్యతతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీధి కుక్కల దత్తత కార్యక్రమం





**నల్గొండ జిల్లా, ప్రతినిధి, మే 30 (ది క్రైమ్ న్యూస్):** గౌరవ నల్గొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హాలియా పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షతన వీధి కుక్కల దత్తత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ, వీధి కుక్కల ప్రాబల్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ దత్తత కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో పెంచుతున్న కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులను వీధుల్లో వదిలిపెట్టకుండా బాధ్యతగా చూసుకోవాలని కోరారు. అలాగే పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని, వీధి కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు ఫ్యామిలీ ప్లానింగ్ (స్టెరిలైజేషన్) కార్యక్రమాలను కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, వెటర్నరీ డాక్టర్ మహిపాల్ రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నకరికంటి సైదులు, 5వ వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాకర్, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, కో-ఆప్షన్ సభ్యులు వర్కాల శేఖర్ రెడ్డి, చెన్ను రాజేశ్వరి, ఎండి. రషీద్, మున్సిపల్ సిబ్బంది మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా దత్తత, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలు సమన్వయంతో అమలు చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

## రిటైర్డ్ పోలీసుల సేవలు శాఖకు చిరస్మరణీయం: సైబరాబాద్ సీపీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన 12 మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందిన వారిలో అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) ఎం. ఫజ్లూర్ రెహమాన్, షాద్‌నగర్, చందానగర్ పోలీస్ స్టేషన్లకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్లు, వివిధ పోలీస్ స్టేషన్లు, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సేవలందించిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరు తమ సుదీర్ఘ సేవా కాలంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి మాత్రమే ముగింపు అని, సేవా భావానికి కాదని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించిన రిటైర్డ్ సిబ్బంది పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. పోలీస్ ఉద్యోగం సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని, ఆ బాధ్యతను విజయవంతంగా నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో కీలకమని అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే తమ అనుభవాన్ని యువ పోలీసు సిబ్బందితో పంచుకుంటూ, వారి వృత్తి నైపుణ్యాల పెంపొందనకు తోడ్పడాలని సూచించారు. భవిష్యత్తులో కూడా పోలీస్ శాఖకు అవసరమైన సందర్భాల్లో సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, మహిళలు, చిన్నారుల భద్రత విభాగం డీసీపీ సృజన కర్ణం, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, సీఏఓ వెంకట్ రెడ్డి, పోలీస్ సహకార సంఘం ఇన్‌చార్జ్ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో డాక్టర్స్ మెడికల్ మాఫియా దందా..!



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ) :** ఖమ్మంలో 200కు పైగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో మందుల విక్రయాలు అడ్డగోలుగా సాగుతున్నాయి. ఫార్మా కంపెనీల కమీషన్లు. విదేశీ పర్యటనల ఆశతో వైద్యులు సిండికేట్‌గా మారి నాణ్యత లేని మందులను రోగులకు అంటగడుతున్నారు. తక్కువ ధరకే లభించే జనరిక్ మందులను పక్కనబెట్టి. కేవలం తమ ఆసుపత్రి దుకాణాల్లోనే దొరికే ఖరీదైన మందులను రాస్తూ రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

## పోలీస్ జాగిలంతో కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



**ఇల్లంతకుంట, మే30(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పలు కిరాణా షాపులు, పాన్ షాపుల్లో నార్కోటిక్ జాగిలం సహాయంతో పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే ఆదేశాల మేరకు ప్రత్యేక తనీఖీలు చేపట్టామని,ఎవరి వద్దైనా నిషేధిత గంజాయి విక్రయాలు, వినియోగాలు జరుగుతుందని తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. డాగ్ స్క్వాడ్ ఇంచార్జి శ్రీనివాస్, ఎస్సై సిరిసిల్ల అశోక్, సిబ్బంది తనిఖీలో పాల్గొన్నారు.

## నెల రోజుల సమ్మర్ క్యాంప్ ఘన ముగింపు 200 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఆహారం, టీ-షర్టుల పంపిణీ





**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మే 30 (ది క్రైమ్ న్యూస్ ):** మిర్యాలగూడ పట్టణంలోని 17వ వార్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నూకల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, బిఎన్ఆర్ ఉ ఎన్ వి ఆర్ బ్రదర్స్ సహకారంతో నిర్వహించిన నెల రోజుల సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకుని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి హాజరయ్యారు. అలాగే పలువురు కౌన్సిలర్లు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు, జీజేసీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఎన్ వి ఆర్ ఉ బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో సుమారు 200 మంది విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు. నిర్వాహకులు నెల రోజుల పాటు ప్రతిరోజూ సుమారు రూ. 5 వేల విలువైన ఆహారాన్ని ఉచితంగా అందించడంతో పాటు, పాల్గొన్న అందరికీ టీ-షర్టులను పంపిణీ చేశారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన అతిథులు, వారికి ఉచితంగా శిక్షణ అందించిన కోచ్‌లను ఘనంగా సన్మానించారు. యువతలో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో నిర్వాహకుల సేవలను పలువురు ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

## 1200 గజాల పార్క్ సుందరీకరణకు కృషి

**ఎన్ ఐ ఎన్ కాలనీ పార్క్ అభివృద్ధిని పరిశీలించిన కొత్త కిషోర్ గౌడ్**
**పబ్లిక్ పార్కులు భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే బహుమతులు**
**మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్**



**బోడుప్పల్:(ది క్రైమ్ న్యూస్):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఎన్ ఐ ఎన్ కాలనీ లో పబ్లిక్ పార్క్ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ పార్కును సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంక్రీట్ జంగల్ గా మారుతున్న ఈ రోజుల్లో పబ్లిక్ పార్క్ లను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలని లక్ష్యంతో సుమారు 1200 గజాల విశాలమైన పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగా ఓపెన్ జిమ్ పరికరాలు,వాకింగ్ ట్రాక్లు, అందమైన పూల మొక్కలతో ఆహ్లాదకర వాతావరణము ఏర్పాట్లు చేయబోతున్నామని, త్వరలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప, ఎన్ ఐ ఎన్ కాలనీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీహరి, నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) సైబరాబాద్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య కార్మికుల కోసం ఉచిత డెంటల్ హెల్త్ అవగాహన శిబిరం, మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ సేవా, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత డెంటల్ క్యాంప్, వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, సమాజ ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సిగరెట్లు, బీడీలు, చుట్టలు, గుట్కా, ఖైనీ, జర్దా వంటి పొగాకు ఉత్పత్తుల్లో ఉండే నికోటిన్ వ్యసనానికి దారితీస్తుందని, ధూమపానం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులు, సంతానలేమి సమస్యలు, వివిధ రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని వివరించారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాల ఆరోగ్యం కోసం పొగాకు వినియోగాన్ని తగ్గించాలని, దీనిపై కఠిన నియంత్రణ చర్యలు అవసరమని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం పొగాకు వినియోగం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 80 లక్షల మంది మరణిస్తున్నారని, వారిలో సుమారు 13 లక్షల మంది పరోక్ష ధూమపానం కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందికి పైగా పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నారని, వీరిలో అధిక శాతం మంది అల్ప, మధ్య ఆదాయ దేశాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సైబరాబాద్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ సింహారాజు, డాక్టర్ శ్వేతా బారపటి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ నిరూప, డాక్టర్ మోహన దీపిక, డాక్టర్ రమ్యశ్రీ, డాక్టర్ జయంతి, డాక్టర్ మన్మోహన్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మంత్రి ప్రగడ సత్యనారాయణరావు, వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ధాన్యం చివరి గింజ కొనేవరకు ప్రభుత్వాన్ని వెంటాడుతాం...

- పంట ముందస్తు ప్రణాళికలో ఎమ్మెల్యే, అధికారులు విఫలం..
- డీఫాల్టు రైసుమిల్లులకు సేకరణ అనుమతులెలా ఇస్తారు
- బిజెపి నేతల ఆందోళనలతోనే సర్కారులో వణుకు
- బిజెపి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ధ్వజం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో సాగు విస్తీర్ణం పంటల రాబడిని అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని, ఇది స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావు చేతగాని తనమేనని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకుడు గొట్టెముక్కుల సురేష్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. దాన్యం సేకరణను వెంటనే పూర్తి చేయాలని, చివరి గింజ కొనేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని సంజీవరెడ్డి స్పష్టం చేశారు. బిజెపి చేపట్టిన రైతుభరోసా యాత్రతో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల్లో వణుకు మొదలై లారీలు సమకూర్చి దాన్యం సేకరణ ప్రారంభించారని తెలిపారు. ఇంకా 50శాతం దాన్యం కొనుగోలు కేంద్రాల్లో మగ్గుతోందన్న ఆయన, ఇటుకబట్టీల లారీలను దాన్యం కొనుగోలు కొరకు వినియోగించాలని సూచించారు. బార్దాన్లు, సుతిలుతాడు చివరకు దబ్బణం సూది కూడా కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తున్నా దాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శలు చేశారు. రూ.700కోట్ల బకాయిలుండగా.. జిల్లాలో దాదాపు 360రైసుమిల్లులు ఉన్నాయని అందులో 70వరకు డీఫాల్టర్లు ఉన్నారని వారివద్ద రూ.700కోట్ల బకాయిలు ఉన్నాయని సంజీవరెడ్డి తెలిపారు. వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశాలు ఉన్నా తిరిగి వారికి దాన్యం కొనుగోలు అనుమతులు ఎలా ఇస్తారని నిలదీశారు. ఇందులో ఎమ్మెల్యేతో పాటు అధికారులకు వాటాలు అందుతున్నాయని ఆరోపించారు. దాన్యం తూకంలో మోసం జరుగుతున్నా ఎమ్మెల్యే కనీసం స్పందించకపోవడం రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ డ్రామాలు పక్కనపెట్టి దాన్యం కొనుగోలును వెంటనే పూర్తిచేయాలని లేనిపక్షంలో మరోసారి ఆందోళన కార్యక్రమాలు చెపడుతామని సంజీవరెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బెజ్జంకి దిలీప్ కుమారు, శివంగారి సతీష్, కందుల శ్రీనివాస్, భూతగడ్డ రాజ్ కుమార్, కాసనగొట్టు విజయ్, రామగిరి అఖిల్, మిట్టపల్లి ప్రవీన్ కుమార్, వెంకట క్రిష్ణ, రాకేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం: టీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇంఛార్జీ సలేంద్ర కొమురయ్య యాదవ్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది, ధాన్యం కొనుగోళ్ల జాప్యంతో అన్నదాతలు అరిగోసపడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ రాష్ట్రసేన పెద్దపల్లి జిల్లా ఇంఛార్జీ సలేంద్ర కొమురయ్య యాదవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం నానా తంటాలు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ, తాలు పేరుతో ధాన్యం కాంటా వేయటంలో ఆలస్యం చేస్తుండటంతో, రైతన్నలు రోజుల తరబడి కేంద్రాల్లోనే గడపాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. దళారులకు అమ్మితే కనీస మద్దతు ధర రావడం లేదని ప్రభుత్వానికే అమ్మడానికి రైతులు రోజుల కొద్దీ ఎదురు చూడాల్సి పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గోనె సంచులు, లారీల కొరత కారణంగా ధాన్యాన్ని తరలించడంలో ఆలస్యమవు తుండటం, అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోయి రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని వాపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్లముందే కొట్టుకుపోతుంటే వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మబలి దానాలకు పాల్పడుతున్నా ప్రభుత్వానికి సోయిలేకుండా పోయిందన్నారు. రైతన్న ప్రాణాలకు, వారి కష్టానికి గుర్తింపు ఇచ్చి వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అసాధారణ జాప్యంతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని, వరి, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను తక్షణం వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొల్లం భూమేష్, చిట్టిమల్ల హనుమాన్లు, కల్వల రవీందర్, కళ్ళ తిరుపతి, అంబాల మహేష్, గడ్డం నరసింహులు, బుడిగె మహేష్‌గౌడ్ తదితరలు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు రూ.7.42 కోట్ల రుణాల పంపిణీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆల్విన్ కాలనీ పట్టణ మహిళ సమాఖ్య సర్కిల్-51 పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌ల ద్వారా మంజూరైన రూ.7 కోట్ల 42 లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, ప్రాజెక్టు అధికారి సురేష్ రెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పూర్ణ రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ ద్వారా 45 సంఘాలకు రూ.5 కోట్లు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా 19 సంఘాలకు రూ.2.42 కోట్లు రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు అందుతున్నాయని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా స్వావలంబన చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలో ఎల్లమ్మబండలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళా శక్తి పథకం కింద పెట్రోల్ బంకులు, ఎలక్ట్రిక్ బస్సులు, సోలార్ యూనిట్లు, కిచెన్, క్యాటరింగ్ వంటి రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులకు రూ.1 లక్ష నుంచి రూ.20 లక్షల వరకు, వ్యక్తిగతంగా రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు రుణ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల అర్హులైన ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో చేర్చి, సంఘాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలను వినియోగించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఓలు ముస్తఫ్ఫా, సుజాత, సర్కిల్-51 అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి పద్మ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు 6 కోట్లు మంజూరు..

- బోడుప్పల్ సర్కిల్‌లో అత్యాధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, తోటకూర వజ్రేష్ యాదవ్ కు, మంజూరు చేయడంపై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు



**బోడుప్పల్:(ది క్రైమ్ న్యూస్):** మల్కాజిగిరి నగరపాలక సంస్థ బోడుప్పల్ సర్కిల్ లో ఆధునిక సౌకర్యాలతో కూడిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేయడంపై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం యువతను శక్తివంతం చేయడంతో పాటు క్రీడలను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు,తోటకూర వజ్రేష్ యాదవ్ చేసిన కృషి,సహకారానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి చొరవ వల్లే బోడుప్పల్ ప్రాంతానికి ఈ కీలక ప్రాజెక్టు మంజూరైందన్నారు. నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆధునిక క్రీడా సదుపాయాలు అందుబాటులోకి రానుండటంతో స్థానిక యువతకు తమ ప్రతిభను చాటుకునే అవకాశాలు మరింత విస్తరించనున్నాయని అజయ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు బోడుప్పల్ ను క్రీడా రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు యువతలో ఆరోగ్యం,ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచేందుకు దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## మియాపూర్, ఆల్విన్ కాలనీ ఫ్లైఓవర్ పనుల పరిశీలన.. త్వరలో శంకుస్థాపన



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు రూ.530 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న భారీ ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనుల ప్రతిపాదిత ప్రాంతాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హెచ్‌ఐసీటీఐ ప్రాజెక్టుల ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు 1,790 మీటర్ల పొడవుతో ఆరు లేన్ల ద్విముఖ ఫ్లైఓవర్, హఫీజ్‌పేట్ నుంచి మియాపూర్ వరకు మూడు లేన్ల ఏకముఖ అండర్‌పాస్, బాచుపల్లి నుంచి ఆల్విన్ చౌరస్తా వరకు మరో మూడు లేన్ల ఏకముఖ అండర్‌పాస్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, బాచుపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని చెప్పారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాఈప్రాజెక్టునుచేపట్టిందని,ప్రజలకువేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఫ్లైఓవర్, అండర్‌పాస్‌ల నిర్మాణంతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వాహనాల ఇంధన వినియోగం కూడా తగ్గుతుందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వేగంగా పెరుగుతున్న జనాభా, ఐటీ రంగ అభివృద్ధి నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి హెచ్‌ఐసీటీఐ ప్రాజెక్టుల ద్వారా కీలక మౌలిక సదుపాయాలనుఅభివృద్ధి చేస్తున్నామని గాంధీ వివరించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు వరుణ్, శ్రీనాథ్, టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బాలింగ్ గౌతమ్ గౌడ్, విఘ్నేశ్వర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కిషన్ రావు, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కుల పరిరక్షణే లక్ష్యం

### ముంజంపల్లిలో ఘనంగా సివిల్ రైట్స్ డే..



**ఎండపల్లి, మే30(ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ...ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు విధులను కూడా తెలుసుకోవాలని సూచించారు.రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించి,సమాన హక్కులు అందరికీ అందేలా కృషి చేయాలని తెలిపారు. పౌర హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వం, వివక్ష రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అన్వేష్, మండల ఎక్సటెన్షన్ ఆఫీసర్ సందీప్ ఉన్నత అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదో వారపు అన్నదానం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదో వారపు అన్నదాన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రికా ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రికా ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం అత్యున్నత సేవ అని పేర్కొన్నారు. ప్రతి వారం నిరంతరంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ అవసరమైన వారికి అండగా నిలుస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు పలువురికి ఉపయోగపడుతున్నాయని, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, కిరణ్, దయాకర్, తేజ, కరుణాకర్, పాండు, జి. కిరణ్, శ్రీరాములు కాలనీ సభ్యులు, ఏఆర్పీ టీమ్ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి..

# వారంలో 104 డీకాయ్ ఆపరేషన్లు






**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, చిన్నారుల భద్రత కోసం చేపట్టిన చర్యలు కొనసాగుతున్నాయి. మే 23 నుంచి 30 వరకు షీ టీమ్స్ నిర్వహించిన 104 డీకాయ్ ఆపరేషన్లలో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 29 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. ఈ సందర్భంగా 37 పెటీ కేసులు నమోదు చేయగా, మరికొందరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇదే కాలంలో వివిధ మార్గాల ద్వారా మహిళల నుంచి 20 ఫిర్యాదులు అందాయి. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఒక మానవ అక్రమ రవాణా కేసులో నలుగురు బాధితులను రక్షించి, ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త, భార్యల మధ్య తలెత్తిన వివాదాల్లో 39 కుటుంబాలను కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా తిరిగి కలిపేందుకు చర్యలు చేపట్టారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఏహెచ్‌టీయూ, షీ టీమ్స్ సంయుక్తంగా పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో 1,844 మంది పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ, స్టాకింగ్, భిక్షాటన, సైబర్ బులీయింగ్, సైబర్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల నంబర్ 100, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 నంబర్ల ప్రాధాన్యాన్ని వివరించారు. ఇదిలా ఉండగా సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ), థామ్సన్ రాయిటర్స్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా బ్రింగ్ యువర్ చైల్డ్ టు వర్క్ కార్యక్రమాన్ని శనివారం మాధాపూర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 8 నుంచి 15 ఏళ్ల వయస్సు గల 50 మందికి పైగా పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారుల భద్రత విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కే. సృజన పిల్లలకు భద్రత, ఆత్మవిశ్వాసం, లక్ష్య సాధనపై అవగాహన కల్పించారు. పోలీసులు ప్రజలకు మిత్రులని, అవసరమైన సమయంలో ఎలాంటి సంకోచం లేకుండా సహాయం కోరాలని సూచించారు. ఎస్‌సీఎస్‌సీ డైరెక్టర్ రష్మి చిన్నారులకు వ్యక్తిగత భద్రత, అపరిచితుల పట్ల అప్రమత్తత, సైబర్ భద్రత, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డంబ్ షరేడ్స్ వంటి వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించి పిల్లలు, తల్లిదండ్రుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేశారు.

## యువతను లక్ష్యంగా చేసుకుంటున్న పొగాకు ఉత్పత్తులపై అప్రమత్తంగా ఉండాలి: కార్డియాలజిస్ట్ డా. అనీష్ పబ్బా



**కరీంనగర్ టౌన్, మే 30(ది క్రైమ్ న్యూస్ ):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. అనీష్ పబ్బా కీలకమైన హెచ్చరికలు చేశారు. పొగాకు వినియోగం గుండె జబ్బులు, స్ట్రోక్, రక్తనాళాల వ్యాధులు వంటి అనేక ప్రాణాంతక సమస్యలకు ప్రధాన కారణమని ఆయన తెలిపారు.ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన థీమ్ ఉన్మాస్క్ ది అప్పీల్ -- కౌంటరింగ్ టాభాకొ నికాటీన్ అడిక్షన్ ఆకర్షణను బట్టబయలు చేయండి - పొగాకు, నికోటిన్ వ్యసనాన్ని ఎదుర్కోండి ను ఆయన గుర్తుచేశారు.డా. అనీష్ పబ్బా వెల్లడించిన ముఖ్య విషయాలు, నికోటిన్ కంపెనీలు రంగురంగుల ప్యాకేజింగ్, ఆకర్షణీయమైన ఫ్లేవర్లు, డిజిటల్ మార్కెటింగ్ ద్వారా యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని ,ధూమపానం వల్ల రక్తనాళాలు దెబ్బతిని, రక్తపోటు పెరిగి గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. పొగాకు వాడకం కేవలం తాగేవాళ్లకే కాకుండా, వారి పక్కన ఉండే కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి కూడా తీవ్ర హాని కలిగిస్తుంది, ధూమపానం వెంటనే మానేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మళ్లీ మెరుగుపరచుకోవచ్చు అని,యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మాయాజాలంపై అవగాహన పెంచుకోవాలని, సమాజం మొత్తం కలిసి పొగాకు రహిత భవిష్యత్తు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.పొగాకు కాదు ఆరోగ్యాన్ని ఎంచుకోండి అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పొగాకుకు దూరంగా ఉండాలని డా. అనీష్ పబ్బా ప్రతిజ్ఞ చేయించారు.

## క్యాన్సర్ నుంచి కోలుకున్న తర్వాత మళ్లీ మళ్లీ ఎందుకు తిరగబెడుతోంది..? దీనిని అడ్డుకోలేమా..

క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. ఈ వ్యాధి శరీరాన్ని గుల్ల చేస్తుంది. చికిత్స కూడా అదే స్థాయిలో తీవ్ర వేధనకు గురి చేస్తుంది. అయితే రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్.. వంటి సందర్భాల్లో చికిత్స విజయవంతంగా పూర్తైన తర్వాత.. పూర్తిగా కోలుకుంటారు. కానీ 25 ఏళ్లు, 30 ఏళ్ల తర్వాత మళ్లీ క్యాన్సర్ బయటపడుతుంది. ఇలాంటి వారి జీవితాల్లో క్యాన్సర్ మరోసారి విధ్వంసం సృష్టించింది. దీంతో క్యాన్సర్ చికిత్స తర్వాత, ఈ వ్యాధి మళ్లీ మళ్లీ ఎందుకు పునరావృతమవుతుంది? అనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా, గత కొన్ని దశాబ్దాలుగా క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గతంతో పోల్చితే ఈ వ్యాధి గురించి ప్రజలు ప్రస్తుతం మరింత అవగాహనతో ఉన్నారు. అందువల్ల సకాలంలో రెగ్యులర్ చెకప్‌ల కారణంగా ఎక్కువ కేసులు గుర్తించి చికిత్స తీసుకుంటున్నారు. చాలా మంది క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించ గలుగుతున్నారు. చికిత్స చేయించుకున్న తర్వాత ప్రజలు క్యాన్సర్ నుంచి విముక్తి పొందుతున్నారు. అయితే ఒకసారి క్యాన్సర్ నయమైన తర్వాత, అది ఇతర అవయవాలలో అభివృద్ధి చెందడం లేదంటే అదే భాగంలో తిరిగి విజృంభించడం వంటివి ఎందుకు జరుగుతాయో.. అందుకు కారణం ఏమోటో ఇక్కడ తెలుసుకుందాం.. నిపుణులు ఏమంటారు? క్యాన్సర్ వెనుక కారణం కణాల అనియంత్రిత పెరుగుదల. దీని వెనుక మన అనారోగ్య జీవనశైలి, అధిక ధూమపానం, ఇతర కారణాలు ఉన్నాయి. కానీ చాలా సందర్భాలలో క్యాన్సర్ నయమైతే, అది శరీరంలోని ఇతర భాగాలలో మళ్లీ సంభవిస్తుందని డాక్టర్ అజయ్ కుమార్ చెబుతున్నారు. క్యాన్సర్ మళ్లీ ఎందుకు వస్తుంది? క్యాన్సర్ అనేది ఒక ప్రమాదకరమైన వ్యాధి. ఇది చాలా సందర్భాలలో నయమైన తర్వాత మళ్లీ వస్తుంది. నేడు, క్యాన్సర్ చికిత్సకు అనేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇవి క్యాన్సర్‌ను నయం చేస్తాయి. అయితే క్యాన్సర్ పునరావృతానికి మాత్రం అనేక కారణాలు కారణమవుతాయి. పునరావృతమయ్యే క్యాన్సర్ వెనుక ఉన్న అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం. ఒకసారి నయమైన తర్వాత రోగి మళ్లీ తన పాత అనారోగ్య అలవాట్లను అనుసరించడం ప్రారంభిస్తే క్యాన్సర్ పునరావృతమయ్యే ప్రమాదం పెరుగుతుంది. అధిక ధూమపానం, పొగాకు వినియోగం కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. క్యాన్సర్ నయమైన తర్వాత, మళ్లీ వీటిని తీసుకునే వారికి మళ్లీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. అనేక సందర్భాల్లో, కుటుంబ చరిత్ర కూడా క్యాన్సర్ పునరావృతానికి కారణం అవుతుంది. శరీరంలో క్యాన్సర్ కణాలు మిగిలి ఉండటం వల్ల మళ్లీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు చికిత్స చేసినప్పటికీ కొన్ని క్యాన్సర్ కణాలు శరీరంలో చురుకుగా ఉండి మళ్లీ క్యాన్సర్‌గా మారుతాయి. ఈ కణాలు శరీరంలోని ఇతర భాగాలలో కూడా అభివృద్ధి చెంది క్యాన్సర్‌కు కారణం అవుతాయి. మహిళల్లో చిన్న వయసులోనే గర్భనిరోధక మాత్రలు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. నేటి కల్తీ యుగంలో, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అనేక అంశాలు ఉన్నాయి. క్యాన్సర్‌ను గుర్తించడానికి స్కాన్ చేసుకోవాలి. క్యాన్సర్ నయమైన తర్వాత, వైద్యులు మొత్తం శరీరాన్ని స్కాన్ చేయకపోతే మళ్లీ క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉండే ప్రమాదం ఉంది.



## ఈ గింజలను ఇలా తింటే పొట్ట తగ్గడం ఖాయం..! బరువు తగ్గి, ఎముకలు బలంగా ఉంటాయ్..!



బరువు తగ్గడానికి చియా గింజల నీరు: బరువు తగ్గడానికి చియా గింజల నీటిని తీసుకోవచ్చు. దీని కోసం ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. ఉదయాన్నే పరగడుపున దీన్ని సేవించండి. ఈ నీటిని రోజూ తీసుకోవడం వల్ల చాలా వరకు బరువు తగ్గవచ్చు. బరువు తగ్గడానికి చియా సీడ్స్ స్మూతీ: బరువు తగ్గడానికి చియా విత్తనాలను స్మూతీస్‌లో ఉపయోగించవచ్చు. దీని కోసం మీకు ఇష్టమైన పండ్లు, పెరుగును వేసి కలపాలి. తర్వాత ఒక చెంచా నానబెట్టిన చియా గింజలను వేసి అన్ని మిక్స్ చేయండి. దీన్ని అల్పాహారంగా తీసుకోవచ్చు. సలాడ్‌లో చియా విత్తనాలను ఉపయోగించండి : బరువు తగ్గడానికి, చియా గింజలను సలాడ్‌లో కలిపి తినవచ్చు. ఇది మీ కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. దీని కోసం, మీరు సలాడ్లో 1-2 స్పూన్ల చియా విత్తనాలను తినవచ్చు. కావాలనుకుంటే నిమ్మరసం, నల్ల మిరియాలు కూడా చల్లుకోవచ్చు. బరువు తగ్గడానికి చియా సీడ్స్ పుడ్డింగ్: బరువు తగ్గడానికి చియా సీడ్స్ పుడ్డింగ్ ఒక ఆరోగ్యకరమైన ఎంపిక. దీన్ని సిద్ధం చేయడానికి, ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను రాత్రంతా పాలలో నానబెట్టండి. ఇందులో పండ్లు, డ్రై ఫ్రూట్స్, నట్స్ వేసి ఉదయాన్నే తీసుకుంటే తినడానికి రుచికరంగా ఉంటుంది మరియు బరువు కూడా తగ్గుతుంది. ఓట్స్, చియా విత్తనాలు: మీరు అల్పాహారంగా ఓట్స్ తింటే, మీరు చియా విత్తనాలను కూడా అందులో కలుపుకోవచ్చు. ఓట్స్‌లో చియా గింజలను వేసుకోవటం వల్ల మీ అల్పాహారం మరింత పోషకమైనదిగా మారుతుంది.ఇదిశరీరంలోని అదనపు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది.

## అధిక రక్తపోటును ఇలా కూడా గుర్తించవచ్చు..

కానీ పరీక్షల చేయించుకున్న తర్వాత గానీ చాలా మందికి శరీరంలో అధిక రక్తపోటు ఉన్నట్లు అర్థమవుతుంది. నిజానికి మైకము, భయము, చెమట, నిద్రలేమి అధిక రక్తపోటు వంటి ప్రారంభ లక్షణాలు ద్వారా అధిక రక్తపోటును గుర్తించవచ్చంటున్నారు నిపుణులు. కానీ ఈ లక్షణాలు చాలా సాధారణం. వీటి ద్వారా మాత్రమే అధిక రక్తపోటుతో బాధపడుతున్నారా లేదా అని నిర్ధారించడం సాధ్యం కాదు. 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' ప్రకారం.. కళ్లు ఎరుపు రంగులోకి మారడం, కనుగుడ్డుపై ఎర్రటి రక్తపు ఛాయలు కనిపించడాన్ని సబ్‌కంజంక్టివల్ హెమరేజ్ అని పిలుస్తారు. ఇది అధిక రక్తపోటు హెచ్చరిక సంకేతంగా పరిగణిస్తారు. సకాలంలో చికిత్స తీసుకోకపోతే అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. డయాబెటిక్ రోగుల కంటి రంగు కూడా కొన్నిసార్లు ఎరుపు రంగులో ఉంటుంది. ఇవే లక్షణాలు అధిక రక్తపోటు ఉన్న రోగులలో కూడా కనిపిస్తాయి. ఫలితంగా, ఇది రెండు వ్యాధుల సాధారణ లక్షణంగా పరిగణిస్తుంటారు. ముఖం ఎర్రబడటం, ఎరుపు కళ్ళు అధిక రక్తపోటు ప్రారంభ సంకేతాలు. ముఖంలోని రక్తనాళాలు పల్చగా మారినప్పుడు ముఖం ఎర్రబారడం జరుగుతుంది. కాబట్టి మీరు ఈ విషయాలన్నీ గమనించినట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## ఘనంగా 'గో టు విలేజ్ మాదిగపల్లెలకు తరలండి' కార్యక్రమం



**కరీంనగర్ టౌన్, మే 30(ది క్రైమ్ న్యూస్):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు 'గో టు విలేజ్ - మాదిగపల్లెలకు తరలండి' కార్యక్రమాన్ని శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కపెల్లి పౌలు ఆధ్వర్యంలో మానకొండూరు మండలంలోని కెల్లేడు, కొండపల్కల, పోచంపల్లి గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఇందులో భాగంగా కొండపలకల గ్రామంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా కన్వీనర్ దండు వరలక్ష్మి మాట్లాడుతూ స్థానిక సర్పంచ్‌తో మాట్లాడి త్వరలోనే జెండా గద్దె నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని మిగతా గ్రామాల్లో కూడా త్వరలోనే గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి, జెండా గద్దెల నిర్మాణాలు చేపడతామని నాయకులు స్పష్టం చేశారు.

## ఈ రెండు విటమిన్లు లోపిస్తే క్యాన్సర్ ముప్పు తప్పదు.. ఆ మార్పులను తేలికగా తీసుకోవద్దు!



క్యాన్సర్ అత్యంత ప్రాణాంతక వ్యాధి. అయితే, చికిత్సలు, మందులతో క్యాన్సర్ ఆటకట్టించొచ్చు. కానీ చికిత్స ఆలస్యమైతే రోగిని రక్షించడం కష్టం. అంతేకాకుండా క్యాన్సర్ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నది అందువల్లనే క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధిగా నేటికీ పరిగణిస్తుంటారు. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్సలు, మందులు ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ చికిత్స ఆలస్యమైతే, రోగిని రక్షించడం కష్టం. ముఖ్యంగా శరీరంలో మూడు విటమిన్లు లోపిస్తే క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. శరీరంలోని ఏ భాగంలోనైనా క్యాన్సర్ రావచ్చు. జన్యుపరమైన కారకాలు, విటమిన్లు, ఖనిజాల లోపం వల్ల కూడా క్యాన్సర్ వస్తుంది. శరీరంలో విటమిన్ సి లోపం క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. విటమిన్ సిని ఆస్కార్బిక్ ఆమ్లం అని కూడా పిలుస్తారు. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో పాటు విటమిన్ 'సి' కొల్లాజెన్ సంశ్లేషణ, గాయాల నయం, వ్యాధుల నివారణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపం వల్ల అన్నవాహిక, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచుతుంది.రోగనిరోధక శక్తిని పెంచడానికి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి విటమిన్-సి అధికంగా ఉండే ఆహారాలు (పాలు, పాల ఉత్పత్తులు, నిమ్మకాయలు, టమోటాలు, క్యారెట్లు, చింతపండు మొదలైన సిట్రస్ పండ్లు) తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. విటమిన్ సితోపాటు విటమిన్ ఎ కూడా క్యాన్సర్‌తో సంబంధం కలిగి ఉంటుంది. ఇది కంటి చూపుతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో, జన్యు నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. విటమిన్ ఎ లోపం ఊపిరితిత్తులు, అన్నవాహిక, కడుపు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. క్యారెట్, గుమ్మడికాయ, పండిన బొప్పాయి, పాలకూర, నెయ్యి, వెన్న, కొవ్వు చేపలు, మాంసం, గుడ్లు వంటి వివిధ కూరగాయలలో విటమిన్ ఎ అధిక స్థాయిలో ఉంటుంది. కాబట్టి ఈ ఆహారాలను డైట్‌లో ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు విటమిన్ డి ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. సాధారణంగా విటమిన్ ఎ సూర్యకాంతి నుండి లభిస్తుంది. విటమిన్ డి లోపం వల్ల రొమ్ము, ప్రోస్టేట్, కొలొరెక్టల్, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ విటమిన్ లోపాన్ని భర్తీ చేయడానికి సూర్యరశ్మి తగిలేలా ఉండాలి. గుడ్డు సొనలు, సముద్రపు చేపలు, పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవాలి.

## ఇప్పటి మీరు ప్లాస్టిక్ బాటిళ్లలోనే నీళ్లు తాగుతున్నారా..? మీ ఆరోగ్యం అంతే సంగతి.. తస్మాత్ జాగ్రత్త..



క్యాన్సర్ వచ్చే ప్రమాదం: ప్లాస్టిక్‌ను అధికంగా ఉపయోగించడం వల్ల శరీరం దానిలోని రసాయనాలతో ప్రత్యక్ష సంబంధంలోకి వస్తుంది. దీని కారణంగా మన శరీరం అనేక వ్యాధులకు రిజర్వాయర్‌గా మారుతుంది. ప్లాస్టిక్‌లోని సీసం, కాడ్మియం, మెర్క్యూరీ వంటి రసాయనాలు శరీరంలో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి విడుదలయ్యే రసాయనాలు మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇది మన రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రోజుల తరబడి ప్లాస్టిక్ బాటిల్స్ లో నీరు తాగుతూ ఉంటే మనిషిలోని రోగనిరోధక శక్తి సన్నగిల్లే ప్రమాదం ఉంది. కాలేయ క్యాన్సర్: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల థాలేట్స్ అనే రసాయనాలు మన శరీరంలోకి చేరి కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. అసలే ఇది వేసవి కాలం.. ప్లాస్టిక్ బాటిల్స్ పై ఎండ పడితే అవి మైక్రోప్లాస్టిక్ ను విడుదల చేస్తాయి. ఆ నీరు తాగితే హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. అండాశయ క్యాన్సర్: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల ప్లాస్టిక్‌లోని రసాయనాల వల్ల మహిళల్లో అండాశయ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ బాటిల్‌కు ఎండ తగిలితే..డయాక్సిన్ లాంటి విషపదార్థాలు నీటిలో కలుస్తాయి. ఆ నీరు తాగడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా పొంచివుంది. ప్లాస్టిక్ బాటిల్‌తో ఇన్ని అనార్థలను ఎదుర్కొకక తప్పదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయంగా రాగి బాటిల్స్,ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న స్టీల్, మట్టి, వెదురు బాటిల్స్ వంటివి వాడితే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. తప్పనిసరిగా ప్లాస్టిక్ బాటిళ్లు ఉపయోగించుకోవాల్సి వస్తే ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్?ను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# విశ్వేజి

# షుగర్ ఉన్నవారు కొబ్బరి నీరు తాగితే ప్రమాదమా?






కొబ్బరి నీరు... ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన పానీయం. వేసవి తాపాన్ని తట్టుకోవడానికి, శరీరాన్ని డీహైడ్రేషన్ నుండి కాపాడుకోవడానికి ఇది ఒక గొప్ప సహజసిద్ధమైన మార్గం. అంతేకాదు, కొబ్బరి నీరు అనేక పోషక విలువలను కలిగి ఉంటుంది. పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా ఉండటం వల్ల ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. అయితే, మధుమేహం (షుగర్ వ్యాధి) ఉన్నవారు కొబ్బరి నీరు తాగొచ్చా? ఇది తరచూ వినిపించే ప్రశ్న. కొబ్బరి నీరు సహజంగా తియ్యగా ఉంటుంది. ఈ తియ్యదనానికి కారణం అందులో ఉండే సహజ చక్కెరలు. మధుమేహం ఉన్నవారు చక్కెర పదార్థాలను తీసుకోవడంపై ఆంక్షలు ఉంటాయి. కాబట్టి, కొబ్బరి నీరు విషయంలో కూడా చాలా మంది సందేహాలు వ్యక్తం చేస్తుంటారు. కొబ్బరి నీటిలో చక్కెర శాతం ఎంత ఉంటుంది? ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందా? మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీరు తాగితే కలిగే ప్రయోజనాలు, నష్టాలేంటి? వంటి విషయాలను ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. కొబ్బరి నీటి పోషక విలువలు: ముందుగా కొబ్బరి నీటిలో ఉండే పోషక విలువల గురించి తెలుసుకుంటే, ఇది మధుమేహ రోగులకు మంచిదా కాదా అనే దానిపై ఒక స్పష్టత వస్తుంది. ఒక కప్పు కొబ్బరి నీటిలో ఉండే పోషకాలు చూస్తే .. కేలరీలు 44, కార్బోహైడ్రేట్లు 10 గ్రాములు, చక్కెరలు 6 గ్రాములు, పొటాషియం 15% (రోజువారీ విలువ), సోడియం 2% మెగ్నీషియం 4% %ణఎ%, విటమిన్ సి 2% %ణఎ%, ఉంటాయి. ఈ పోషకాలను గమనిస్తే, కొబ్బరి నీటిలో చక్కెరలు ఉన్నప్పటికీ, కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేకాకుండా, ఇది పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఎలక్ట్రోలైట్లకు మంచి మూలం. ఈ ఎలక్ట్రోలైట్లు శరీరంలో ద్రవ సమతుల్యతను కాపాడటానికి, కండరాల పనితీరుకు, రక్తపోటును నియంత్రించడానికి సహాయపడతాయి. %ూశీషవతీవఎ దీఎ% మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీరు తాగొచ్చా? మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీరు తాగవచ్చు, కానీ మితంగా తీసుకోవడం ముఖ్యం. ఎందుకంటే, కొబ్బరి నీటిలో సహజ చక్కెరలు ఉంటాయి. అయితే, ఈ చక్కెరలు ప్రాసెస్ చేసిన చక్కెరల వల్లే కాకుండా సహజ రూపంలో ఉంటాయి. అంతేకాకుండా, కొబ్బరి నీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ అనేది ఒక ఆహారం రక్తంలో చక్కెర స్థాయిలను ఎంత త్వరగా పెంచుతుందో తెలిపే కొలమానం. కొబ్బరి నీటి %+×% సుమారు 54 గా ఉంటుంది, ఇది మధ్యస్థం లేదా తక్కువగా పరిగణించబడుతుంది. అయితే, గ్లైసెమిక్ లోడ్ కూడా ముఖ్యమైనది. గ్లైసెమిక్ లోడ్ అనేది ఒక నిర్దిష్ట ఆహార పరిమాణం రక్తంలో చక్కెర స్థాయిలపై చూపే ప్రభావాన్ని తెలియజేస్తుంది. కొబ్బరి నీటి %+ూ% తక్కువగా ఉంటుంది. కాబట్టి, మితంగా తీసుకుంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచే అవకాశం తక్కువ. మధుమేహ రోగులకు కొబ్బరి నీటి ప్రయోజనాలు: కొబ్బరి నీరు మధుమేహ రోగులకు కొన్ని ప్రయోజనాలను కూడా అందిస్తుంది. మధుమేహం ఉన్నవారికి డీహైడ్రేషన్ ప్రమాదం ఎక్కువ. కొబ్బరి నీరు శరీరానికి తగినంత నీటిని అందించి డీహైడ్రేషన్ నుండి కాపాడుతుంది. మధుమేహం కారణంగా శరీరంలో ఎలక్ట్రోలైట్ల అసమతుల్యత ఏర్పడవచ్చు. కొబ్బరి నీరు ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా వ్యాయామం తర్వాత ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. యాంటీఆక్సిడెంట్లు: కొబ్బరి నీటిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షించడంలో సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారిలో ఆక్సీకరణ ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది, యాంటీఆక్సిడెంట్లు ఈ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. కొబ్బరి నీటిలో పొటాషియం అధికంగా ఉండటం వల్ల రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహం ఉన్నవారికి రక్తపోటు సమస్య కూడా సాధారణం. కొబ్బరి నీరు మూత్రవిసర్జనను పెంచుతుంది, తద్వారా మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మధుమేహం మూత్రపిండాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. జాగ్రత్తలు - పరిమితులు: మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీరు తాగేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. రోజుకు ఒక గ్లాసు కంటే ఎక్కువ కొబ్బరి నీరు తాగకూడదు. పరిమితికి మించి తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. కొబ్బరి నీరు తాగిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. వారు మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి సరైన సలహా ఇవ్వగలరు. మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీరు తాగొచ్చు, కానీ మితంగా తీసుకోవడం మరియు రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షించడం ముఖ్యం. కొబ్బరి నీరు డీహైడ్రేషన్ నుండి కాపాడటం, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను మెరుగుపరచడం వంటి కొన్ని ప్రయోజనాలను అందిస్తుంది. అయితే, ఇది మధుమేహానికి చికిత్స కాదు. సమతుల్య ఆహారం, వ్యాయామం , వైద్యుల సూచనలు పాటించడం ద్వారా మధుమేహాన్ని సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చు. ఏదైనా సందేహం ఉంటే వైద్య నిపుణులను




## ముడతలు అన్నీ మాయం: ఇంట్లోనే ఈజీగా చేసుకునే బెస్ట్ ఫేస్ మాస్క్..

### అందమే అసూయపడేలా అవుతారు

సాధారణంగా మన వయస్సు పెరిగే కొద్దీ మొఖం మీద ముడతలు వస్తాయి. చర్మం కుంగిపోవడం ప్రారంభమవుతుంది. సన్నని గీతలు కనిపించడం ప్రారంభిస్తాయి. ఇవన్నీ వృద్ధాప్యాన్ని సూచిస్తుంటాయి. అయితే ఇంట్లోనే తయారుచేసుకునే కొన్ని రకాల ఫేస్ మాస్క్ ల ద్వారా, మన ఆహారంలో చిన్న చిన్న మార్పులు ద్వారా వీటిని తగ్గించవచ్చు. ఇందుకోసం కొల్లాజెన్‌ను పెంచే వాటిని మీ ఆహారంలో చేర్చండి. కొల్లాజెన్ మన చర్మాన్ని మృదువుగా చేస్తుంది. ఇది చర్మానికి స్థితిస్థాపకతను ఇస్తుంది. మీ రోజువారీ ఆహారంలో ఉసిరి, నిమ్మకాయ నీటిని చేర్చుకోండి. నువ్వులను కూడా వాడండి. అయితే వీటితో తయారుచేసే ఫేస్ మాస్క్ చర్మానికి సహజ బూస్టర్‌గా పనిచేస్తుంది, చర్మం దాని స్థితిస్థాపకతను తిరిగి పొందడానికి సహాయపడుతుంది. "దీపికా పదుకొనె అందానికి కారణం ఈ జ్యూస్ అంట.. అతిపెద్ద సీక్రెట్ బయట పెట్టేసిన ఆమె న్యూట్రీషియన్" ఫేస్ మాస్క్ ఇలా చేయండి ఈ ఫేస్ మాస్క్ సిద్ధం చేయడానికి 2 టీస్పూన్ల తెల్ల నువ్వులు, 2 టీస్పూన్ల వేరుశెనగలు, 1 టీస్పూన్ ఆలివ్ నూనె తీసుకోవాలి. మూడు చీజ్‌లను శుభ్రమైన మిక్సర్ చలో వేసి బాగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి మీ ముఖానికి మసాజ్ చేయండి ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఒక గాజు గిన్నెలో పోసి అందులో 1 టీస్పూన్ తేనె కలిపి పేస్ట్ లా చేయండి. ఈ పేస్ట్ ని మీ ముఖం మీద పేస్ట్ లాగా అప్లై చేయండి. ఇప్పుడు లైట్ మసాజ్ చేయండి. మసాజ్ చేయడానికి,మీ బొటనవేలును తీసివేసి దానిని పిడికిలిగా చేసి మీ గడ్డం చుట్టూ ఉన్న చర్మాన్ని పైకి ఎత్తండి. మసాజ్ చేయడానికి మీ వేళ్ల కీళ్లను ఉపయోగించండి. మీ మొఖం మొత్తాన్ని 10 నిమిషాల పాటు పూర్తిగా మసాజ్ చేసిన తర్వాత మీ ముఖంపై మందపాటి మాస్క్ పొరను వేయండి. మాస్క్ అప్లై చేసిన తర్వాత 1 గంట పాటు అలాగే ఉంచండి. ఆరిన తర్వాత మీ ముఖాన్ని నీటితో సున్నితంగా తడిపి స్క్రబ్ లాగా శుభ్రం చేయండి. ఇప్పుడు మీ ముఖాన్ని శుభ్రమైన నీటితో కడుక్కోండి,స్టీమర్ లో కొన్ని పుదీనా ఆకులను వేసి ఆవిరి పట్టండి. ఇలా కొద్దిసేపు ఆవిరి పట్టిన తర్వాత మీ ముఖాన్ని టవల్ తో కప్పుకోండి. ఇలా 10 నిమిషాలు అలాగే ఉంచి, ఆపై మీ ముఖం నుండి టవల్ తొలగించండి. కొన్ని రోజుల్లోనే మీరు తేడాను గమనించవచ్చు. మీ చర్మం మెరిసిపోతుంది.

## చర్మ సౌందర్యానికి రాగి..ఇంట్లోనే ఇలా చేస్తే సహజ మెరుపు గ్యారెంటీ!





మిల్లెట్స్ లో ఒకటైన రాగులు మన ఆరోగ్యానికి చేలు మేలు అంతా ఇంతా కాదు. ఇవి పోషక విలువలు కలిగిన తృణధాన్యాలు.. రాగిని ఆహారంలో చేర్చడం ద్వారా ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. రాగులు కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ బి వంటి పోషకాలకు గొప్ప మూలం. ఇందులో ఇతర తృణధాన్యాల కంటే ఎక్కువ కాల్షియం ఉంటుంది, ఇది ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం. రాగుల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. రాగులు అధిక రక్తపోటుతో బాధపడేవారికి మంచి టానిక్ లా పనిచేస్తాయి. అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా రాగి అందిస్తుంది. సహజ మార్గాల్లో చర్మ సంరక్షణను కోరుకునే ప్రతి ఒక్కరికీ రాగి ఉత్తమమైన ఆప్షన్. రాగులను చర్మానికి కూడా ఉపయోగించవచ్చు. రాగి ఫేస్ ప్యాక్ చర్మానికి అనేక విధాలుగా సహాయపడుతుంది. రాగిలో యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉండటంతో చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచి సహజమ్మెన మెరుపుని అందిస్తాయి. ప్రత్యేకంగా రాగి పొడిని ఫేస్ ప్యాక్‌గా ఉపయోగించడం వల్ల మొటిమలు, మచ్చలు, చర్మం ఎండిపోవడం వంటి సమస్యలు తగ్గించుకోవచ్చుంట. "పొద్దున్నే ఈ పూరీ తింటే రోగాలన్నీ పరార్..షుగర్ పేషెంట్లు కూడా హాయిగా తినొచ్చు..ఎలా చేయాలంటే" రాగుల్లో యాంటీమైక్రోబియల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. రాగుల్లోని విటమిన్లు,ఖనిజాలు చర్మం మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. రాగుల్లోని యాంటీఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి. రాగుల్లోని ఫైబర్ చర్మం తేమను నిలుపుకోవడానికి సహాయపడుతుంది. రాగి ఫేస్ ప్యాక్ ని ఇంట్లోనే ఎలా తయారుచేసుకోవాలి రాగి ఫేస్ ప్యాక్ తయారీ కోసం 2 టేబుల్ స్పూన్లు రాగి పొడి, 1 టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ పెరుగు, కొద్దిగా నిమ్మకాయ రసం కలిపి మెత్తగా పేస్ట్ చేయాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి 15-20 నిమిషాల పాటు అలా వదిలేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో మృదువుగా కడిగితే చర్మం కాంతివంతంగా మారుతుంది. "తరచుగా శృంగారంలో పాల్గొంటే ఈ అరుదైన వ్యాధి వస్తుందట.. లక్షణాలు ఎలా ఉంటాయంటే?" రాగి ఫేస్ ప్యాక్ వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే రాగి ఫేస్ ప్యాక్ మృతకణాలను తొలగించడంతో పాటు చర్మాన్ని మృదువుగా మార్చే సహజ ఎక్స్‌ఫోలియంట్‌గా పనిచేస్తుంది. రాగిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ముడతలను తగ్గించి, యవ్వనాన్ని కాపాడతాయి. అంతేకాకుండా ఇది చర్మానికి తగినంత తేమను అందించి పొడిబారకుండా ఉంచుతుంది. చర్మాన్ని సహజంగా మెరుగుపర్చుకోవాలను కునేవారు రాగిని ఫేస్ ప్యాక్‌గా మాత్రమే కాకుండా తమ రోజువారీ ఆహారంలో భాగంగా కూడా తీసుకుంటే మరింత మెరుగైన ఫలితాలు పొందవచ్చు. రాగిని ఆహారంలో చేర్చడం ద్వారా కూడా చర్మ కాంతి పెరుగుతుంది. రాగి గంజి, రాగి దోస, రాగి చపాతీల వంటి ఆహార పదార్థాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందించి చర్మాన్ని ఫ్రెష్ గా ఉంచుతాయి. రాగి ఫేస్ ప్యాక్ ను వారానికి 2-3 సార్లు ఉపయోగించవచ్చు. అయితే మీకు రాగులు అలర్జీ ఉంటే ఈ ఫేస్ ప్యాక్ ను ఉపయోగించవద్దు. ఫేస్ ప్యాక్ ఉపయోగించే ముందు మీ చర్మానికి సరిపోతుందో లేదో తెలుసుకోవడానికి ఒక చిన్న ప్యాచ్ టెస్ట్ చేయడం బెటర్.


# మార్కెట్

## రూ.93 వేల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ : గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు దిగొచ్చాయి. ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన పుత్తడి ధర శుక్రవారం రూ.93 వేల స్థాయికి దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడంతో ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.1,350 తగ్గి రూ.93 వేలకు దిగొచ్చిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. గురువారం రికార్డు స్థాయికి చేరుకున్న ధరల ఆ మరుసటి రోజే భారీగా తగ్గడం విశేషం. డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపడంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన పుత్తడి నుంచి ఈక్విటీలవైపు మళ్లించడంతో తగ్గుముఖం పట్టాయని బులియన్ వర్తకులు వెల్లడించారు. బంగారంతోపాటు వెండి భారీగా తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.5,000 తగ్గి రూ.95,500కి దిగొచ్చింది. గడిచిన నాలుగు నెలల్లో ఒక్కరోజు ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి కావడం విశేషం. బంగారం ధరలు వారం కనిష్ఠ స్థాయి, వెండి ఐదు వారాల కనిష్ఠ స్థాయికి జారుకున్నట్లు మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 21.74 డాలర్లు తగ్గి 3,093.60 డాలర్లకు పడిపోగా, వెండి 31.32 డాలర్లకు పరిమితమైంది.



## రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి




ముంబై : దేశీయ ఈక్విటీ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపడంతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. మరోసారి ఆర్థిక మాంద్యం గుప్పిట్లోకి అగ్రరాజ్యం అమెరికా వెళ్తున్నదంటూ వచ్చిన వార్తలు మదుపరుల్లో ఆందోళనను పెంచింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ 76 వేల దిగువకు పడిపోయింది. బ్లూచిప్ సంస్థల కరెక్షన్‌కు గురికావడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయింది. ఇంట్రాడేలో 1,055 పాయింట్లు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 930.67 పాయింట్లు లేదా 1.22 శాతం నష్టపోయి 75,364.69 పాయింట్ల వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ 345.65 పాయింట్లు(1.49 శాతం) కోల్పోయి 22,904.45 వద్ద స్థిరపడింది. సూచీలు ఒక్క శాతం వరకు నష్టపోవడంతో మదుపరులు రూ.10 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.9,98,379.46 కోట్లు కరిగిపోయి రూ.4,03,34,886. 46 కోట్లకు జారుకున్నది. ఫార్మా షేర్లకు టారిఫ్‌ల సెగ త్వరలో దేశీయ ఫార్మా ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లను విధించబోతున్నట్టు ప్రకటించడంతో ఈ రంగ షేర్లు కుప్పకూలాయి. అత్యధికంగా 11 శాతం మేర నష్టపోయాయి. మర్కాసన్స్ ఫార్మా షేరు అత్యధికంగా 11.18 శాతం నష్టపోగా..లారస్ ల్యాబ్స్ 7.40 శాతం, శిల్పా మెడికేర్ 6.56 శాతం, ఇప్కా ల్యాబ్స్ 6.53 శాతం, అరబిందో ఫార్మా 5.96 శాతం, లుపిన్ 5.85 శాతం, గ్లాండ్ ఫార్మా 5.51 శాతం, అజంతా ఫార్మా 5.40 శాతం, సిప్లా 5.32 శాతం, బయోకాన్ 5.09 శాతం, దివీస్ ల్యాబ్ 4.70 శాతం, డాక్టర్ రెడ్డీస్ 3.60 శాతం, సన్‌ఫార్మా 3.43 శాతం పతనం చెందాయి.

## ఢీ అంటే ఢీ.. అమెరికాకు చైనా ఝలక్

### దీటుగా ప్రతీకార సుంకాలు

అగ్రరాజ్యం అధ్యక్షుడు ప్రతీకార సుంకాలు ప్రకటించిన గంటల వ్యవధిలోనే చైనా గట్టిగా బదులిచ్చింది. ట్రంప్‌కు రిటర్న్ గిఫ్ట్‌ను సిద్ధం చేసి ట్రేడ్ వార్‌కు సై అన్నది. తమపై విధించిన 34 శాతం అదనపు సుంకాలకు తగ్గట్టుగానే అమెరికా దిగుమతులపై సుంకాలు వేస్తామని స్పష్టం చేసింది. ఈ నెల 10 నుంచే మొదలు. బీజింగ్ : ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టుగా అమెరికా ప్రతీకార సుంకాలపై ఆయా దేశాలు దీటుగా స్పందిస్తున్నాయి. ఈ ధిక్కార పోరు ఊహించినట్టుగానే చైనాతోనే మొదలైంది. డ్రాగన్‌తో మొదట్నుంచీ పొసగని ట్రంప్.. బుధవారం పెద్ద ఎత్తునే టారిఫ్‌లను విధించారు. అమెరికాలోకి వచ్చే చైనా వస్తూత్పత్తులపై 34 శాతం సుంకాలు ఉంటాయని తేల్చిచెప్పారు. ఇప్పుడు వర్తిస్తున్న సుంకాలపై ఇవి అదనం. దీనికి చైనా కూడా శుక్రవారం అదే స్థాయిలో జవాబిచ్చింది. ఈ నెల 10 నుంచి మా దేశంలోకి దిగుమతి అయ్యే అన్ని అమెరికా వస్తూత్పత్తులపై మరో 34 శాతం సుంకాలు పెరుగుతాయని జిన్‌పిన్ సర్కారు స్పష్టం చేసింది. ఈ మేరకు అక్కడి ప్రభుత్వ రంగ జిన్హువా న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ముదురుతున్న వాణిజ్య యుద్ధం ప్రపంచంలోని రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ రాజుకుంటున్నది. అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి ఎన్నికైనప్పుడే ట్రంప్.. చైనాతో ఢీ అంటే ఢీ అన్న సంగతి విదితమే. అయితే అగ్రరాజ్యాధినేతగా బైడెన్ వచ్చాక ఈ ఉద్రిక్తతలు క్రమేణా తగ్గుముఖం పట్టాయి. కానీ ఇప్పుడు ట్రంప్ రావడంతో మళ్లీ కథ మొదటికే వచ్చినైట్టెంది.

# ఆంధ్రప్రదేశ్

## హైబ్రిడ్ విధానంలో మహానాడు విజయవంతం

**కృషి చేసిన నేతలను అభినందించిన చంద్రబాబు**

అమరావతి,మే30 : తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘనవిజయం సాధించిందని టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహానాడును సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే.. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు. టీడీపీ పుట్టిందే తెలంగాణ గడ్డపై, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని అన్నారు.

## ఎంపి అభిషేక్ బెనర్జీపై దాడి

**కోడిగుడ్లు, చెప్పులు విసిరిన స్థానికులు**

**ఇదంతా బిజెపి పన్నాగమన్న అభిషేక్**

కోల్‌కతా,మే30 : మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు సోనార్‌పుర్ వెళ్లిన ఆయనపై స్థానికులు రాళ్లు, కోడిగుడ్లు చెప్పులు విసిరారు. కొందరు ఆయనపై చేయి చేసుకున్నారు. అభిషేక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గో బ్యాక్ అంటూ దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దాడి జరుగుతున్న సమయంలో అభిషేక్ బెనర్జీ హెల్మెట్ ధరించగా.. భద్రతా సిబ్బంది ఆయనకు రక్షణగా నిలిచారు. అనంతరం చిరిగిన చొక్కాతో ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనకు భాజపానే కారణమని ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే దాడి చేశారని.. తనను చంపేందుకు ప్రయత్నించారని అన్నారు. దాడి సమయంలో పోలీసులు ఎక్కడా కనిపించలేదన్నారు. ఈ ఘటనపై న్యాయపోరాటం చేస్తానని తృణమూల్ నేత పేర్కొన్నారు.

## ఖరీఫ్‌కు 22,348 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

**90 శాతం రాయితీపై రైతులకు అందజేత**

**మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడి**

విజయనగరం,మే30 : జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన 22,348 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేసినట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇందులో 8,883 క్వింటాళ్ల వరి విత్తనాలను గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 802 టార్పాలిన్లు, 14 ఆయిల్ ఇంజన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి సాలూరు మెంటాడ వీధిలోని 1, 2 వార్డుల్లో కాలువలు, వీధుల పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమవుతూ వీధుల్లో అరుగులపై కూర్చొని మహిళలతో కలిసి కాఫీ తాగారు. ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా మంత్రి స్కూటర్‌పై కార్యక్రమ స్థలానికి చేరుకోవడం ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఖరీఫ్-2026 సీజన్‌కు రైతులకు భారీ ఎత్తున రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. సాలూరు నియోజకవర్గ రైతులకు 8,100 ఖఓఆఃూ కిట్లను కూడా పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు భూమిలో తేమ నిల్వ ఉండి, రైతుల ఆదాయం పెరగడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

## గ్రేటర్ పరిధిలో ముగిసిన సమ్మర్ ఆఫర్

**జూన్ 1 నుంచి యధావిధిగా బస్సు ఛార్జీలు**

**ఆర్టీసీ నగర రీజియన్ అధికారుల ప్రకటన**

హైదరాబాద్ : ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ షాకింగ్ న్యూస్ చెప్పింది. వేసవి కాలంలో ప్రయాణికులకు ఉపశమనం కలిగించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రవేశపెట్టిన ప్రత్యేక సమ్మర్ డిస్కౌంట్ ఆఫర్ ముగిసిందని తెలిపింది. మూడు నెలల పాటు మార్చి, ఏప్రిల్, మేలలో ఇచ్చిన రాయితీ గడువు ముగియడంతో జూన్ 1 నుంచి మెట్రో డీలక్స్, ఏసీ బస్సుల్లో పాత చార్జీలను యథావిధిగా పునరుద్ధరిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ మార్పుపై ప్రయాణికుల్లో ఎలాంటి గందరగోళం లేకుండా ఈ మేరకు శనివారం (మే 30) క్లారిటీ ఇచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో కొత్తగా ఎలాంటి ఛార్జీలను పెంచలేదని, కేవలం వేసవి కాలం కోసం ప్రత్యేకంగా అందించిన సమ్మర్ డిస్కౌంట్ గడువు మాత్రమే ముగిసిందని పేర్కొంది. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సంస్థకు సహకరించాలని అధికారులు కోరారు. తీవ్రమైన ఎండల దృష్ట్యా సామాన్య ప్రయాణికులకు సుఖవంతమైన, ఏసీ ప్రయాణాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశ్యంతో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ సమ్మర్ ఆఫర్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి 2026, మార్చి నుంచి 2026, మే 31 2026 వరకు ఈ రాయితీలు అందుబాటులో ఉన్నాయి. మూడు నెలల పాటు కొనసాగిన సాగిన ఈ ఆఫర్ గడువు ముగియడంతో జూన్ 1వ తేదీ నుంచి రాయితీకి ముందు ఉన్న పాత టికెట్ ధరలే అమలులోకి వస్తాయి. ఈ మూడు నెలల పాటు ఆఫర్‌ను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి సహకరించిన ప్రయాణికులకు ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం ధన్యవాదాలు తెలియజేసింది.

# ధవళేశ్వరం ఆయకట్టు రైతులకు శుభవార్త

**నేటినుంచి నీటి విడుదలకు నిర్ణయం**

**నీటిపారుదల సలహామండలి భేటీలో నిర్ణయం**

**మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి**




కాకినాడ,మే30 : మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నందన నీటిని విడుదల చేస్తామని అన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. ఈ మేరకు నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అరుదైన ఘనత

**దేశంలోనే తొలిసారిగా పిఎం-సేతు పథకం అమలు**

అమరావతి,మే30 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అరుదైన ఘనత లభించింది. దేశంలోనే తొలిసారిగా పిఎం-సేతు పథకం అమలు చేయనున్న రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఈ మేరకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్టీరింగ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన 'స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్'కు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో విశాఖ ఐటీఐల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ప్రముఖ ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ భాగస్వామ్యంతో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. జాతీయ స్థాయిలో రూ.60,000 కోట్ల బ్జడెట్‌తో చేపడుతున్న ఈ కార్యక్రమంలో మొదటి దశలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. విశాఖ ఐటీఐల అభివృద్ధికి అకడమిక్ భాగస్వామిగా ఔంఓఃఇఅఉ సంస్థ కూడా రంగంలోకి దిగింది. ఈ ప్రాజెక్టులో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ను అమలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఐటీఐ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. కోర్సు పూర్తి చేసిన వెంటనే విద్యార్థులకు నేరుగా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే పిఎం సేతు లక్ష్యంగా కేంద్రం పేర్కొంది. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వ ఐటీఐలను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీ బాటలోనే నడవడానికి మరో 12 రాష్ట్రాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పరిశ్రమల భాగస్వామ్యానికి వేగంగా టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని కేంద్ర వర్గాలు వెల్లడించాయి.

## పారదర్శకంగా డీఎస్సీ నియామక పక్రియ

**డీఎస్సీ నిర్వహణపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం**

**విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టీకరణ**

అమరావతి,మే30 : డీఎస్సీ నిర్వహణపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. డీఎస్సీ నియామక పక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ నియామక పక్రియకు రాష్ట్రవ్యాప్తంగా 3.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని శశిధర్ తెలిపారు. డీఎస్సీ నియామక పక్రియపై 226 కేసులు దాఖలైనప్పటికీ, కేవలం 148 రోజుల్లోనే నియామకాలను పూర్తి చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. 154 టీసీఎస్ అయాన్ (ఃఅఃూ తిక్షఔ) కేంద్రాల్లో విజయవంతంగా పరీక్షలను నిర్వహించినట్లు కోన శశిధర్ తెలిపారు. డీఎస్సీ ప్రశ్నాపత్రాన్ని ఎవరూ మానిప్యులేట్ చేయలేరని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రం తయారీ నుంచి పరీక్ష నిర్వహణ వరకు పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలను పాటించినట్లు వివరించారు. ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలను యాక్సెస్ చేసే అవకాశం కేవలం ఇద్దరు సీనియర్ అధికారులకు మాత్రమే ఉంటుందని తెలిపారు. క్వశ్చన్ బ్యాంక్ పాస్‌వర్డ్‌లు ప్రతిరోజూ మారుతూ ఉండటంతో భద్రత మరింత కఠినంగా ఉంటుందని చెప్పారు. ఆ ఇద్దరు అధికారులు మాత్రమే టీసీఎస్ సిస్టంలో ప్రశ్నలను అప్‌లోడ్ చేస్తారని, పరీక్ష రోజు ప్రశ్నాపత్రం జంబుల్డ్ రూపంలో అభ్యర్థులకు అందుతుందని పేర్కొన్నారు. ప్రశ్నలు ఎన్‌క్రిప్ట్ చేయబడిన విధంగా ఉంటాయని, వాటిని డీకోడ్ చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అనేక ప్రతిష్టాత్మక పరీక్షలు ఇదే విధానంలో నిర్వహిస్తున్నట్లు కోన శశిధర్ తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంలో మాన్యువల్ జోక్యం చాలా తక్కువగా ఉంటుందని చెప్పారు. ఏపీ హైకోర్టు సహా అనేక సంస్థల పరీక్షలు కూడా ఇదే విధానంలో నిర్వహిస్తారని వివరించారు. ఃఅఃూ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, కఠినమైన భద్రతా ప్రోటోకాల్ అమల్లో ఉన్నాయని, ఎక్కడా విధాన ఉల్లంఘనలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఫలితాల ప్రకటన పక్రియలోనూ పారదర్శకత పాటించినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ కీ విడుదల చేసిన తర్వాత అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి,్గ ÷నైల్ కీని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అన్ని జిల్లాల స్కోర్లను 11వ తేదీన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు.

## సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయాలు

**11 ఎజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి గ్రీన్ సిగ్నల్**

**సిఎంసి భవన నిర్మానానికి 161 కోట్లు మంజూరు**

హైదరాబాద్,మే30 : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, నగర అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అధ్యక్షతన, సీఎంసీ కమిషనర్ సృజన ఆధ్వర్యంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మొత్తం 11 ఎజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా పలు ప్రధాన రోడ్ల అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జె.జె.నగర్ నుంచి కొంపల్లి వరకు 30 మీటర్ల రోడ్డు అభివృద్ధి పనులకు, అలాగే అమీన్‌పూర్ కమాన్ నుంచి బందం కొమ్ము చెరువు వరకు 45 మీటర్ల రోడ్డు ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. ఇక సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కు సంబంధించి ఏఎస్సీఐ సేవల ప్రతిపాదనను కమిటీ ఉపసంహరించుకుంది. ఈ సమావేశంలో అన్నిటికంటే ముఖ్యంగా సీఎంసీ శాశ్వత కార్యాలయ భవన నిర్మాణానికి కమిటీ ఆమోదం తెలిపింది. ఖానామెట్‌లో నిర్మించబోయే ఈ భవనానికి రూ. 161 కోట్లు మంజూరు చేశారు. అలాగే ఖైత్లాపూర్ లో జీ ప్లస్ 8 అంతస్తులతో అధునాతన కార్యాలయ భవనాన్ని నిర్మించనున్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా దీనిని జీ ప్లస్ 12 అంతస్తుల వరకు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రజా సమస్యలు, దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారం కోసం టౌన్ ఎ÷-లానింగ్ ,ఇంజినీరింగ్ విభాగాలను బలోపేతం చేయాలని కమిటీ నిర్ణయించింది. ఫీల్డ్ తనిఖీలను వేగవంతం చేయడానికి టౌన్ ఎ÷-లానింగ్‌లోనూ, మౌలిక సదుపాయాల పనుల పర్యవేక్షణకు ఇంజినీరింగ్ విభాగంలోనూ అదనపు సిబ్బందిని నియమించనున్నారు. పరిపాలనా సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు వీలుగా కన్సల్టెన్సీ సపోర్ట్ సర్వీసుల వినియోగానికి కూడా కమిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా విలీనమైన యూఎల్బీల్లో దోమల నియంత్రణే లక్ష్యంగా ఎంటమాలజీ పైలట్ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నారు. దీని కోసం ఫాగింగ్ మిషన్లు, ఇతర పరికరాల కొనుగోలుతో పాటు సిబ్బంది నియామకానికి ఓకే చెప్పారు. అలాగే నగరంలో చెట్ల నిర్వహణ, ప్రజా భద్రత కోసం 14 బకెట్ ల్యాడర్లను ఏర్పాటు చేయనున్నారు. నగర పచ్చదనం, బయోడైవర్సిటీని పెంచేందుకు రూ. 5.70 కోట్లతో అర్బన్ బయోడైవర్సిటీ కార్యక్రమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.నగరంలో క్రీడా సౌకర్యాల లీజు ధరలు, వాటి కాలపరిమితి సవరణలకు కూడా స్టాండింగ్ కమిటీ ఆమోదం ముద్ర వేసింది.

## సింగరేణి డిస్పెన్సరీ మూత సరికాదు

**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రచార కార్యదర్శి**

ఖమ్మం,మే30 : రామవరం సింగరేణి డిస్పెన్సరీ మూసివేత కుట్రను యాజమాన్యం తక్షణమే విరమించుకోవాలని, ఆస్పత్రిని పునరుద్దరించాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం అయన మీడియాతో మాట్లాడుతూ.. రామవరం ప్రాంతంలో నివసిస్తున్న వందలాది మంది సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబాలతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఈ వైద్యశాల ఎంతో కాలంగా వైద్య సేవలు అందిస్తోందని, ఈ ఆస్పత్రిలో కొత్త వైద్యుల నియామకం చేపట్టకుండా, కేవలం ఇద్దరు స్టాఫ్‌తో మందులు ఇచ్చేలా యాజమాన్యం కుట్రపూరితంగా మార్చిందని మండిపడ్డారు.

## పాలకులే హంతకులుగా మారుతున్నారు

**అభిషేక్ బెనర్జీపై దాడిని ఖండించిన మమతా బెనర్జీ**

కోల్‌కతా,మే30 : తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై దాడి జరగడంపై ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'పాలకులు హంతకులుగా మారుతున్నారు. బీజేపీకి ఇది సిగ్గుచేటు' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మండిపడ్డారు. 'అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో బాధితుడైన సంజు కర్మాకర్ కుటుంబాన్ని పరామర్శిస్తానని ఇచ్చిన మాటకు అభిషేక్ బెనర్జీ కట్టుబట్టారు. సోనార్‌పూర్ వెళ్లారు. బీజేపీ దన్నుతో కొందరు దుండగులు మా జాతీయ ప్రధాన కార్యదర్శిపై అమానుషంగా దాడి చేశారు. అయినప్పటికీ ఆయన బీజేపీ గూండాల దాడిలో నష్టపోయిన కుటుంబానికి అండగా నిలిచారు. కనికరంతో కూడిన రాజకీయాలకూ, విద్వేషంతో కూడిన రాజకీయాలకు ఉన్న తేడా ఇదే. సువేందు హయాంలో చోటుచేసుకుంటున్న బెదిరింపులు, హింస, ప్రతీకార రాజకీయాలు మరోసారి ఇవాళ బహిర్గతమయ్యాయి' అని ఆ ట్వీట్‌లో మమత పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో భాదితులను పరామర్శించేందుకు సోనార్‌పూర్ వెళ్లిన అభిషేక్‌పై స్థానికులు రాళ్లు, కోడిగుడ్లు, చెప్పులు విసిరారు. కొందరు ఆయనపై చేయి చేసుకున్నారు. 'దొంగ' అంటూ నినాదాలు చేస్తూ దాడికి దిగారు. ఆ సమయంలో హెల్మెట్ ధరించిన అభిషేక్‌కు భద్రతా సిబ్బంది రక్షణగా నిలిచారు. కాగా, ముందస్తు ప్రణాళిక ప్రకారమే తనపై దాడి జరిపారని, తనను చంపేందుకు ప్రయత్నించారని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. దాడి సమయంలో పోలీసులు ఎక్కడా కనిపించలేదన్నారు. తనపై జరిగిన దాడిపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఘటన అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం కోల్‌కతాలోని ఆపోలో ఆసుపత్రిలో చేరారు.

## అభిషేక్ బెనర్జీపై దాడి హేయం

**తీవ్రంగా ఖండించిన ఖర్గే, అఖిలేష్**

న్యూఢిల్లీ,మే30 : పశ్చిమ బెగాల్ సోనార్‌పూర్‌లో టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై శనివారం జరిగిన దాడిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఖండించారు. రాజకీయ భేదాభిప్రాయాలున్నంత మాత్రాన హింసకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన హింసాత్మక ఘటనల బాధితులను పరామర్శించేందుకు టీఎంసీ ఎంపీ శనివారం సోనార్‌పూర్ వెళ్లిన సందర్భంగా కొందరు కోడి గుడ్లు, రాళ్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిని తాజాగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా ఖండించారు. ఆయనకు తగినంత పోలీసు భద్రత లేకపోవడాన్ని బట్టి బీజేపీ రాజకీయాలు, ప్రతీకారాలను అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రతిపక్ష నేతల భద్రత కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు, సమాజ్ వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ కూడా అభిషేక్ బెనర్జీపై దాడిని ఖండించారు. తాము ఎంతటి ద్వేషపూరిత రాజకీయాలకైనా దిగగలమని బీజేపీ ఈ దాడితో రుజువు చేసిందని వ్యాఖ్యానించారు. సున్నిత ప్రాంతాల్లో కూడా పోలీసు భద్రత లేకపోవడం కుట్ర కోణాన్ని సూచిస్తోందని ఎక్స్ వేదికగా కామెంట్ చేశారు. బీజేపీ కార్యకర్తలే అభిషేక్ బెనర్జీపై దాడికి దిగారని టీఎంసీ ఆరోపించింది.

## మంత్రాలయం వద్ద విషాద ఘటన


**తుంగభద్రలో మునిగి ఐదుగురు గల్లంతు**

కర్నూలు,మే30 : మంత్రాలయం వద్ద విషాదం చోటుచేసుకుంది. తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లిన ఐదుగురు గల్లంతయ్యారు. హైదరాబాద్‌కు చెందిన యువన్ చంద్ర (5), సతీష్ (35), మంత్రాలయంకు చెందిన రాఘవేంద్ర (25), ధను (23), ఉరవకొండకు చెందిన సంధ్య (22) నదిలో గల్లంతైన వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రాలయంలోని ఓ ఇంట్లో జరిగిన సత్యనారాయణ స్వామి పూజకు హాజరైన బంధువులు, పూజ అనంతరం సమీపంలోని తుంగభద్ర నదికి వెళ్లి ఈతకు దిగినట్లు సమాచారం. నీటి లోతు అంచనా వేయకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలుస్తోంది. ఘటనలో ఆదోనికి చెందిన అపర్ణ సురక్షితంగా బయటపడినట్లు అధికారులు తెలిపారు.




# పులి-మేకతో రోజా రీ ఎంట్రీ


సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణేశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.




# వారణాసి స్టిల్స్ లీక్..జక్కన్న మౌనం

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్‌కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు.

# కరిష్మాకపూర్ తాజా వెబ్ సీరిస్ బ్రౌన్




బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే పక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ఎ÷-లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.






# దర్శకుడు సంపదీప్ రెడ్డి సమర్పణలో రోమాచంకం

అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.




# రికార్డులు తిరగరాస్తున్న కరుప్పు

## 300 కోట్ల వసూళ్లను దాటిన మూవీ

తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell :
7989575563, Mail:thecrimenews123@gmail.com

# భువనేశ్వర్ ఆర్‌సీబీకి అసలైన 'గేమ్ ఛేంజర్'!

స్పోర్ట్స్

ఐపీఎల్ ఫైనల్ పోరు కోసం బరిలోకి దిగేందుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సిద్ధంగా ఉంది. ఈ కీలకమైన మ్యాచ్‌లో కోహ్లీ, పడిక్కల్‌ల బ్యాటింగ్ ఎంత ముఖ్యమో, బౌలింగ్ దళంలోని ఒక ఆటగాడి బాధ్యత కూడా అంతే పెరిగింది. ఫైనల్ పోరులో గుజరాత్ టైటాన్స్‌ని ఓడించి కప్ గెలవాలనే స్పష్టమైన వ్యూహం ఆర్సీబీకి ఉంది. మ్యాచ్‌పై ఉత్సాహం పతాకస్థాయిలో ఉంది, అభిమానులు విజయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లాస్ట్ టైమ్ గెలవడంతో.. మళ్లీ గెలిచి.. "ఈ సాలా కప్ నందే" అనాలని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. క్రికెట్ పండితుల ప్రకారం, ఆర్సీబీ విజయాన్ని ఖాయం చేయడానికి ఫైనల్‌లో భువనేశ్వర్ కుమార్‌కి కేవలం 3 వికెట్లు మాత్రమే అవసరం. తన స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేయగల భువనేశ్వర్ కుమార్ సామర్థ్యం.. ఆర్సీబీ శిబిరంలో కొత్త ఆశలను రేకెత్తించింది. గుజరాత్ జట్టుకి బ్యాటింగ్ అతి పెద్ద ప్లస్ పాయింట్. ఆ బ్యాటింగ్ వెన్నెముకను విరిచేందుకు భువనేశ్వర్ కుమార్ వేసే మొదటి కొన్ని ఓవర్లు కీలకం కానున్నాయి. అది వర్కౌట్ అయితే.. తిరుగుండదు. ఆర్సీబీ గెలవాలంటే.. జీటీ జట్టులోని కీలక ఆటగాళ్లైన సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, జోస్ బట్లర్ వికెట్లు తీసి తీరాలి. ఈ ముగ్గురు ఆటగాళ్లు క్రీజులో నిలిస్తే, జీటీ భారీ స్కోర్లు సాధించడం సులభం. అందువల్ల, భువనేశ్వర్ కుమార్ తన తెలివైన బౌలింగ్‌తో వారిని త్వరగా ఔట్ చేస్తే, జీటీ జట్టు విజయగాథ గోవిందే అవుతుందనడంలో సందేహం లేదు. ఈ ఉత్కంఠ భరితమైన ఫైనల్..



గుజరాత్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనుంది. టాస్ గెలవాలన్న కెప్టెన్ నిర్ణయం మ్యాచ్ గమనాన్ని మార్చగలదు. అహ్మదాబాద్ పిచ్ ఫాస్ట్ బౌలర్లకు ఎక్కువ సహకారం అందించే అవకాశం ఉంది. ఆదివారం మే 31 నాడు సాయంత్రం 7 గంటలకు టాస్ జరగనుండగా, మ్యాచ్ 7.30 గంటలకు ప్రారంభమవుతుంది. యావత్ భారతదేశం ఈ మ్యాచ్‌ను వీక్షించడానికి ఆసక్తిగా ఎదురుచూస్తోంది. గతంలో జరిగిన మ్యాచ్‌లో జీటీపై ఆర్‌సీబీకి ఉన్న రికార్డును పరిగణనలోకి తీసుకుంటే, ఈసారి సిల్వర్ టీమ్ ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. జట్టు ఐక్యత, ఆటగాళ్ల ఫామ్ ఆర్‌సీబీని ఫేవరెట్ టీమ్‌గా మార్చాయి. ఫైనల్ ఒత్తిడిని తట్టుకుని, తమ అసలైన ఆటను ప్రదర్శించగలిగితే, ట్రోఫీ కచ్చితంగా బెంగళూరుకే దక్కుతుంది. భువనేశ్వర్ కుమార్‌పై జట్టు మొత్తానికీ నమ్మకం ఉంది. అతను కొత్త బంతితో వేసే ప్రతీ బంతీ.. జీటీ బ్యాట్స్‌మెన్‌లకు మింగలేని వేడి నూనెలా ఉంటుంది. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ల బలహీనతలను అర్థం చేసుకుని బౌలింగ్ చేసే భువనేశ్వర్ కుమార్ సామర్థ్యమే ఈ టైటిల్ మ్యాచ్‌కు మలుపు కానుంది. జట్టులోని ఇతర బౌలర్లు కూడా భువనేశ్వర్ కుమార్‌కు మంచి సహకారం అందిస్తే, ఆర్‌సీబీ విజయ మార్గం సుగమం అవుతుంది. చాలా మంది క్రికెట్ విశ్లేషకులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్సీబీ జట్టు బ్యాటింగ్‌లోనే కాకుండా బౌలింగ్ విభాగంలో కూడా క్రమశిక్షణ చూపిస్తే, జీటీ జట్టు ఆటగాళ్లు కోరుకున్నన్ని పరుగులు చేయలేరు. భువి 3 వికెట్లు తీస్తే, అది జీటీ ఓటమికి దారితీస్తుందని పండితులు కచ్చితంగా చెబుతున్నారు. బెంగళూరు అభిమానులు కూడా భువి మ్యాజిక్ కోసం ప్రార్థిస్తున్నారు. ఆర్‌సీబీకి ఈ ఫైనల్ కేవలం ఒక ఆట మాత్రమే కాదు, ఇది ఒక భావోద్వేగం. స్టేడియంలో అభిమానుల సముద్రం ఉంటుంది. భువనేశ్వర్ కుమార్ తన బౌలింగ్ దాడితో జీటీ కీలక ఆటగాళ్లను త్వరగా అవుట్ చేసి, విజయానికి పునాది వేయగలిగితే, ఆర్‌సీబీ ఫైనల్ కప్‌ను గెలుచుకోవడం ఖాయం. ఐతే.. హోంగ్రౌండ్‌లో ఈ మ్యాచ్ జరుగుతోంది కాబట్టి.. గుజరాత్ టైటాన్స్ కూడా ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉంటారు. స్టేడియంలో ఆ రాష్ట్ర ఫ్యాన్స్.. వారికి బూస్ట్ ఇస్తారు. అయినప్పటికీ ఆర్సీబీ భువీ ప్లాన్ వర్కవుట్ చేస్తే, గెలుపు తలుపు తట్టినట్లే.

## ఒంటరిగా కూర్చొని ఏడ్చిన వైభవ్ సూర్యవంశీ..!

ఐపీఎల్ 2026 క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ చేతిలో రాజస్థాన్ రాయల్స్ ఓడిపోయిన తర్వాత.. వైభవ్ సూర్యవంశీ మైదానంలోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఈ మ్యాచ్‌లో ఒంటరి పోరాటం చేసి 47 బంతుల్లో 96 పరుగులు చేసినప్పటికీ జట్టును ఫైనల్‌కు చేర్చలేకపోయాననే బాధతో డగౌట్‌లో కూర్చుని, తన క్యాప్‌ను ముఖానికి అడ్డుపెట్టుకుని గుక్కపెట్టి ఏడ్చాడు. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ తృటిలో సెంచరీ మిస్సయినా ఏమాత్రం కుంగిపోని ఈ కుర్రాడు, జట్టు ఓడిపోవడాన్ని మాత్రం తట్టుకోలేకపోయాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ పోరాటం ముగిసింది. వైభవ్ సూర్యవంశీ వీర బాదుడుతో క్వాలిఫయర్-2 వరకు చేరిన ఆ జట్టు.. శుక్రవారం గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. వైభవ్ 47 బంతుల్లో 96 రన్స్ చేసినా.. ఓటమిని మాత్రం తప్పించలేకపోయాడు. దీంతో మ్యాచ్ అనంతరం తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. 15 ఏళ్ల వైభవ్.. బ్యాటింగ్‌లో ఎంతో పరిణతి చూపించాడు. ఓపక్క వికెట్లు పడుతున్నా.. పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ చేశాడు. వరుసగా రెండో మ్యాచులో సెంచరీ మిస్ అయినా.. ఏమాత్రం బాధపడలేదు. కానీ మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత మాత్రం గుక్క పెట్టి ఏడ్చాడు! క్వాలిఫయర్-2లో ఓడిపోయిన తర్వాత వైభవ్ సూర్యవంశీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చిన తర్వాత అతడు డకౌట్‌లోకి వెళ్లిపోయాడు. ఒంటరిగా అక్కడే కూర్చొన్నాడు. తన క్యాప్‌ను అడ్డుపెట్టుకుని.. కన్నీళ్లు కార్చాడు. తన జట్టును ఫైనల్ చేర్చలేకపోయామని బాధ అతడి కళ్లలో స్పష్టంగా కనిపించింది. దీంతో లోపలి నుంచి వస్తున్న బాధను అతడు కన్నీళ్ల రూపంలో బయటకు పంపించేశాడు. పాల బుగ్గల ఈ కుర్రాడు.. వెక్కి వెక్కి ఏడ్చాడు! ఇది గమనించిన రాజస్థాన్ రాయల్స్ సపోర్టింగ్ స్టాఫ్.. అతడిని ఓదార్చే ప్రయత్నం చేశారు. కాసేపటికి కోలుకున్న అతడు.. తిరిగి మైదానంలోకి వచ్చి.. అవార్డులు అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటో, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే బాధలో ఉన్నప్పటికీ తనతో ఫొటో కావాలని అడిగిన గ్రౌండ్ స్టాఫ్, పోలీసు సిబ్బందికి అతడు సహకరించాడు. వారందరికీ ఫొటోలు ఇచ్చాడు. నిజానికి ఈ మ్యాచులో సెంచరీ మిస్ అయినా.. వైభవ్ ఇంతలా ఫీల్ కాలేదు. కానీ మ్యాచులో ఓడిపోయిన తర్వాత మాత్రం తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయాడు. ఇది చూసిన నెటిజన్లు.. ఇది కదా స్పోర్ట్స్‌మన్ షిప్ అని కామెంట్లు చేస్తున్నారు. వైభవ్.. నిజమైన హీరో అని ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఓటమిని మైమరిపించే విజయాలను భవిష్యత్‌లో అందుకుంటాడని కామెంట్లు చేస్తున్నారు.



# తుది సమరానికి సర్వం సిద్ధం

## బెంగళూరు, గుజరాత్ మధ్య తుది పోరు

ఐపీఎల్ 2026 తుది సమరానికి సర్వం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని ప్రతిష్టాత్మక నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు ట్రోఫీ కోసం తలపడనున్నాయి. రెండు జట్లూ తమ రెండో ఐపీఎల్ టైటిల్‌పై కన్నేయడంతో ఈ మ్యాచ్ అభిమానుల్లో మునుపెన్నడూ లేని ఉత్కంఠను రేకెత్తిస్తోంది. గుజరాత్ టైటాన్స్ జట్టుకు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఈ అహ్మదాబాద్ మైదానంతో ఒక విడదీయరాని సెంటిమెంట్ ముడిపడి ఉంది. ఇదే పిచ్‌పై 2022లో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించి గుజరాత్ తన తొలి ఐపీఎల్ కప్‌ను ముద్దాడింది. మరోవైపు, సుదీర్ఘ కాలంగా అభిమానులను ఊరించిన ఆర్సీబీ, గత ఏడాది అంటే ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఇదే మైదానంలో మట్టికరిపించి 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తొలిసారి విజేతగా నిలిచింది. ఇప్పుడు ఇరు జట్లూ తమ రెండో ట్రోఫీని గెలుచుకుని లీగ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య ఉన్న హెడ్-టు-హెడ్ రికార్డులు ఎలా ఉన్నాయో పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఐపీఎల్ చరిత్రలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు ఇప్పటివరకు మొత్తం 9 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ఇందులో ఆర్సీబీ 5 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, గుజరాత్ టైటాన్స్ 4 మ్యాచ్‌ల్లో జయభేరి మోగించింది. ఈ గణాంకాలను బట్టి చూస్తే ఇరు జట్ల మధ్య పోటీ ఎంత హోరాహోరీగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. రికార్డుల పరంగా బెంగళూరు జట్టుకు స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ, గుజరాత్ జట్టు ఏనాడూ వారికి సులువుగా మ్యాచ్‌లను వదిలిపెట్టలేదు. ఇరు జట్లలోనూ ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగల దిగ్గజ ఆటగాళ్లు ఉండటంతో, ఈ 2026 ఫైనల్ మ్యాచ్‌లో కూడా పరుగుల సునామీతో పాటు తీవ్రమైన పోరాటం సాగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సీజన్ లీగ్ దశలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. ఆడిన 14 మ్యాచ్‌లలో 9 విజయాలు, 5 ఓటములతో మొత్తం 18 పాయింట్లు సాధించింది. మెరుగైన నెట్ రన్ రేట్ (ం0.783) కారణంగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుని నేరుగా క్వాలిఫయర్-1కు దూసుకెళ్లింది. యువ కెప్టెన్ రజత్ పాటిదార్ సారథ్యంలో జట్టు ఎంతో సమతుల్యంగా కనిపిస్తోంది. బ్యాటింగ్ విభాగంలో రజత్ పాటిదార్, దేవదత్ పడిక్కల్, విరాట్ కోహ్లీ నిలకడగా పరుగులు సాధిస్తుండగా, బౌలింగ్‌లో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తిస్తున్నారు. క్వాలిఫయర్-1 లో గుజరాత్‌ను ఓడించి నేరుగా ఫైనల్‌కు చేరిన ఆర్సీబీ, ప్రస్తుత ఫామ్ ప్రకారం టైటిల్ గెలిచే బలమైన జట్టుగా బరిలోకి దిగుతోంది. మరోవైపు శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ సైతం ఈ సీజన్ లీగ్ దశలో 14 మ్యాచ్‌లలో 9 విజయాలు, 5 ఓటములతో 18 పాయింట్లు సాధించి రన్ రేట్ ఆధారంగా రెండో స్థానంలో నిలిచింది. గుజరాత్ జట్టుకు వారి టాప్ ఆర్డర్ బ్యాటింగ్ ప్రధాన బలంగా మారింది. కెప్టెన్ గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్ అద్భుతమైన ఫామ్‌లో ఉంటూ పరుగుల వరద పారిస్తున్నారు. బౌలింగ్ విభాగంలో కాగిసో రబాడా, మహ్మద్ సిరాజ్, రషీద్ ఖాన్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లు ఉన్నారు. క్వాలిఫయర్-1 లో ఆర్సీబీ చేతిలో పరాజయం పాలైనప్పటికీ, పట్టువదలకుండా క్వాలిఫయర్-2 లో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించి గుజరాత్ ఫైనల్లో అడుగుపెట్టింది.



## వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌కు ఐపీఎల్ ఫ్యాన్స్ ఫిదా..!


ఐపీఎల్ 2026 సీజన్‌లో 15 ఏళ్ల రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అదరగొట్టాడు. ఆరెంజ్ క్యాప్ రేసులో అందరికంటే టాప్‌లో నిలిచి ప్రపంచ క్రికెట్‌ను అబ్బురపరిచాడు. బుమ్రా, రబాడా, కమిన్స్, హేజిల్‌వుడ్ లాంటి ప్రపంచ స్థాయి బౌలర్లను సైతం దయాదాక్షిణ్యాలు లేకుండా ఉతికేసిన ఈ పాలబుగ్గల చిన్నోడు.. ఈ ఎడిషన్‌లో పరుగుల సునామీ సృష్టించాడు. ఈ సీజన్ పేరు చెబితేనే తన పేరు గుర్తొచ్చేలా చేశాడు. ఐపీఎల్ 2026లో ఆరెంజ్ క్యాప్ రేసులో ఎవరు ఉంటారు? సీజన్ ప్రారంభానికి ముందు ఈ ప్రశ్నకు సమాధానంగా విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, అభిషేక్ శర్మ లాంటి వారి పేర్లు వినిపించాయి. కానీ కట్ చేస్తే.. ఇప్పుడు ఆ లిస్ట్‌లో 15 ఏళ్ల పాల బుగ్గల చిన్నోడు టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. బుమ్రా, రబాడా, కమిన్స్, హేజిల్‌వుడ్ లాంటి హేమాహేమీ బౌలర్లను ఊచకోత కోసిన వైభవ్.. ఈ సీజన్‌లో పరుగుల సునామీ సృష్టించాడు. తన బ్యాటింగ్ నైపుణ్యాలతో ప్రపంచ క్రికెట్‌ను అబ్బురపరిచాడు. సమస్త క్రికెట్ అభిమానుల దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. తన అరంగేట్ర సీజన్ అయిన ఐపీఎల్ 2025లోనే వైభవ్ సత్తాచాటాడు. కానీ ఈ సీజన్‌లో మాత్రం అంతకుమించి రాణించాడు. క్రీజులోకి వచ్చిన మొదటి బంతి నుంచి బాదడం పనిగా పెట్టుకుని.. రికార్డులు కొల్లగొట్టాడు. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో కనీవినీ ఎరుగని రికార్డులను సొంతం చేసుకున్నాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి స్టార్ ప్లేయర్లకు సైతం దక్కని రికార్డులను 15 ఏళ్ల వయసులోనే సొంతం చేసుకున్నాడు. తన జట్టు టైటిల్ గెలవకపోయినా.. ఐపీఎల్ 2026లో హీరోగా మారిపోయాడు. ఈ సీజన్ పేరు చెబితేనే.. తన పేరు గుర్తొచ్చేలా చేశాడు. వైభవ్‌కు వచ్చీ రాగానే బాదతాడనే పేరు ఉంది. కానీ క్వాలిఫయర్-2 మ్యాచులో తనలోని అసలైన క్రికెటర్‌ను అతడు బయటకు తీశాడు. ఎప్పుడూ ఫోర్లు, సిక్సర్లు బాదడమే కాదు.. పరిస్థితులకు తగ్గట్లు తనను తాను అన్వయించుకుని కూడా ఆడగలనని నిరూపించాడు. తాను చూపిన పరిణతితో బ్యాటర్‌గా మరో మెట్టు ఎక్కేశాడు. టోర్నీ ఆసాంతం తన బ్యాటింగ్ విన్యాసాలతో.. లీగ్‌కే ప్రత్యేక ఆకర్షణగా మారిపోయాడు. కోహ్లీ, ధోనీ, రోహిత్‌కు ఉన్నట్లుగా ప్రత్యేక ఫ్యాన్ బేస్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ సీజన్‌లో అతడు అందించిన వినోదానికి ఐపీఎల్ అభిమానులు థ్యాంక్స్ చెబుతున్నారు. వచ్చే సీజన్‌లో టైటిల్ సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ సీజన్‌లో ఆడిన 16 మ్యాచులలో 766 పరుగులు చేశాడు వైభవ్. ఫైనల్‌లో గిల్, సుదర్శన్ హాఫ్ సెంచరీలు స్కోరు చేయకపోతే.. ఈ ఎడిషన్‌లో ఆరెంజ్ క్యాప్‌ను సైతం ఈ 15 ఏళ్ల కుర్రాడే సొంతం చేసుకుంటాడు.

## ఫైనల్ వర్షం కారణంగా రద్దయితే విజేత ఎవరు?

అహ్మదాబాద్: రెండు నెలల నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్లైమాక్స్‌కు చేరింది. నేడు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, మాజీ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్ చాలా బలమైన జట్లు. టైటిల్ పోరులో ఆర్సీబీ, గుజరాత్ జట్ల మధ్య హోరాహోరీ ఖాయమని క్రికెట్ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒకవైపు ఆర్సీబీ క్వాలిఫైయర్ 1 గెలిచి నేరుగా ఫైనల్‌లో చోటు దక్కించుకోగా, మరోవైపు ఎలిమినేటర్ విజేతతో రెండో క్వాలిఫైయర్ మ్యాచ్‌లో గుజరాత్ జట్టు రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించి ఫైనల్ చేరింది. ఐపీఎల్‌లో మొత్తం 10 జట్లు, 70 కి పైగా మ్యాచ్‌లు, రెండు నెలలకు పైగా సాగిన పోరాటం ముగింపునకు వచ్చింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతున్న ఫైనల్ మ్యాచులో ఆర్సీబీ, గుజరాత్ తలపడనున్నాయి. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే వర్షం వస్తే విజేత ఎవరు, మే 31న అసలు మ్యాచ్ నిర్వహించే అవకాశం లేకపోతే, ఎవరు ఛాంపియన్‌గా నిలుస్తారు? అని రెండు జట్ల ఫ్యాన్స్ తెలుసుకోవాలని భావిస్తున్నారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ ఫైనల్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో వర్షం కురిస్తే, మే 31నే మ్యాచ్‌ను పూర్తి చేయడానికి ప్రయత్నిస్తారు. వర్షం చాలా గంటలు పడితే ఓవర్లను కుదిస్తారు. వర్షం తగ్గకపోతే విజేతను తేల్చేందుకు 120 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు.

# గుజరాత్‌పై ఇర్ఫాన్ పఠాన్ ఆగ్రహం

ఐపీఎల్ రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని అవుట్ చేయడానికి గుజరాత్ టైటాన్స్ బౌలర్లు అనుసరించిన బాడీ లైన్ బౌలింగ్ వ్యూహంపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. కేవలం 15 ఏళ్ల కుర్రాడిపై అంతగా విరుచుకుపడటం తన మనసును గాయపరిచిందంటూ పఠాన్ భావోద్వేగానికి లోనయ్యాడు. ఐపీఎల్ 19వ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. నిన్న జరిగిన రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై గుజరాత్ టైటాన్స్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ నెల 31న జరగబోయే మహా సంగ్రామంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుతో గుజరాత్ తలపడనుంది. అయితే, ఈ మ్యాచ్ ఫలితం కంటే కూడా రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశి బ్యాటింగ్, అతనిపై గుజరాత్ బౌలర్లు ప్రయోగించిన అస్త్రాలే ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో, 15 ఏళ్ల వయసున్న వైభవ్ సూర్యవంశీని ఒత్తిడిలోకి నెట్టేందుకు గుజరాత్ టైటాన్స్ బౌలర్లు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. నిరంతరం షార్ట్ పిచ్ బంతులు వేస్తూ, నేరుగా అతని శరీరాన్ని లక్ష్యంగా చేసుకుని (బాడీ లైన్ బౌలింగ్) బౌలింగ్ చేశారు. బంతులు వరుసగా ఒంటికి తగులుతున్నా, ఆ వయసులోనే వైభవ్ చూపిన అసాధారణ ధైర్యం అందరినీ ఆశ్చర్యపరిచింది. గుజరాత్ బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ కేవలం 47 బంతుల్లోనే 96 పరుగుల సునామీ ఇన్నింగ్స్ ఆడి రాజస్థాన్‌కు భారీ స్కోరు అందించాడు. మ్యాచ్ అనంతరం ఈ బాడీ లైన్ బౌలింగ్ వ్యూహంపై ఇర్ఫాన్ పఠాన్ స్పందిస్తూ తీవ్ర ఆవేదన



వ్యక్తం చేశాడు. అత్యున్నత స్థాయి క్రికెట్‌లో సీనియర్ ఆటగాళ్లతో పోటీ పడుతున్నప్పుడు ఇలాంటి కఠినమైన వ్యూహాలు సహజమేనని తనకు తెలుసని పఠాన్ పేర్కొన్నాడు. అయితే, ఒక తండ్రి స్థానంలో ఉండి ఆలోచిస్తే మాత్రం ఆ చిన్న వయసు కుర్రాడి శరీరాన్ని టార్గెట్ చేస్తూ బౌలింగ్ చేయడం తన మనసుకు అస్సలు నచ్చలేదని స్పష్టం చేశాడు. కేవలం 15 ఏళ్ల వయసున్న ఆటగాడిపై అంతటి ఒత్తిడి తీసుకురావడం బాధాకరమంటూ ఇర్ఫాన్ పఠాన్ సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించాడు. గుజరాత్ బౌలర్లు ఎంతగా భయపెట్టాలని చూసినా వెనక్కి తగ్గకుండా, శరీరంపై దెబ్బలు తింటూనే వైభవ్ సూర్యవంశి ఆడిన ఇన్నింగ్స్‌పై మాజీ క్రికెటర్లు, క్రీడా విశ్లేషకులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇంత చిన్న వయసులో అంతటి పరిపక్వత, మానసిక దృఢత్వం ప్రదర్శించడం నిజంగా అద్భుతమని కొనియాడుతున్నారు. గుజరాత్ మ్యాచ్ గెలిచి ఫైనల్ చేరినప్పటికీ, నిన్నటి మ్యాచ్‌లో అసలైన హీరో మాత్రం వైభవ్ సూర్యవంశి అంటూ అభిమానులు సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు.